తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గజవాహనంపై శ్రీ మహాలక్ష్మి సాక్షాత్కారం



తిరుచానూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త:
తిరుచానూరు అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం గజవాహనంపై శ్రీ మహాలక్ష్మి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపం వద్ద కల్యాణోత్సవం వేడుకగా చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని వేంచేపు చేసి సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువులు తీర్చి తిరుమడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఏవిఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఇన్స్పెక్టర్ సుభాస్కర్, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పుష్పయాగానికి "అంకురార్పణ"



తిరుమల, అక్టోబర్ 29 ప్రభాతవార్తప్రతినిధి:
బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు పుష్పయాగం జరిపించడం సంప్రదాయం. నేడు జరిగే పుష్పయాగానికి బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు వసంతమండపంలో "అంకురార్పణ"చేపట్టారు. ఆలయ పేష్కార్ రామకృష్ణ,ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ,అర్చకులు పాల్గొన్నారు.

# తుపాన్ నష్టపరిహార గణన చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :
జిల్లాలో తుపాన్ నష్ట పరిహార గణన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఆర్ డి ఓ లు, మున్సిపల్ కమిషనర్‌లు, తాసిల్దార్లు, సంబంధిత శాఖ లైన్ డిపార్ట్మెంట్ అధికారంతో కలిసి జిల్లాలో తుఫాన్ నష్టపరిహార గణన చర్యలపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర తుఫాన్ ప్రభావిత జిల్లాల కన్నా తిరుపతి జిల్లాలో తుపాన్ ప్రభావం చాలా తక్కువ శాతం నష్టం నమోదయిందని, జిల్లాలో యుద్ధ ప్రాతిపదికను తుఫాన్ నష్ట పరిహార గణన చర్యలు చేపట్టాలని తెలిపారు. తుపాన్ ప్రభావం వలన బురద, చెత్త పేరుకు పోయిన ప్రాంతాల్లో శానిటేషన్ ను చేపట్టేలా వెనువెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాటర్ ట్యాంక్ లు శుభ్రం చేయడం పాటు క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట వాటర్ ట్యాంక్ లు ద్వారా తాగు నీరు అందేలా చూడాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రతి చోట కూడా మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయాలని, వారికి మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలో భాగంగా ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. నీరు నిల్వ ఉన్నచోట లార్వా ఉత్పత్తి కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. చెరువులు, కాజ్వే లు వద్ద వరద ప్రవాహం తగ్గేవరకు ఇరిగేషన్ శాఖ ఎప్పటికప్పుడుపర్యవేక్షించాలన్నారు. జిల్లాలో అన్ని ట్యాంకులు నిండుకుండలా ఉన్నాయని, రబీ సీజన్ అవసరం మేరకు నీటిని నిలువ చేసుకోవాలని తెలిపారు..తుఫాన్ వలన గుంతలు ఏర్పడిన చోట, ఆర్ అండ్ బి అధికారులు నేషనల్ హైవే వాళ్ళతో సమన్వయం చేసుకొని రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు అవసరం మేరకు రోడ్ల రిక్వైర్మెంట్ ఉన్న ఎడల ఉపాధి హామీ పథకం కింద వాటిని చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. విద్యుత్తు పునర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నిత్యవసర సరుకులు, ప్రతి కుటుంబానికి మూడు వేల రూపాయలు అందించేలా సంబంధిత అధికారులు త్వరత గతిన వారికి అందేలా చూడాలన్నారు. నిత్యవసర సరుకులలో భాగంగా బాధితులకు 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, లీటర్ వంటనూనె, కేజీ ఉల్లిగడ్డలు, కేజీ ఉల్లిపాయలు, కేజీ చక్కర అందించడంతోపాటు పునరావాస కేంద్రాల నుంచి వారి నివాసానికి వెళ్లే వారికి ప్రతి కుటుంబానికి 3 వేల రూపాయలు చొప్పున అందేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖ వారు సమన్వయంతో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వరద ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రాంతాలలో బీచ్ లు, చెరువుల దగ్గర ఎవరిని కూడా నాలుగు రోజులు వరకు వెళ్లకుండా రెవెన్యూ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నరసింహులు, తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి శేషాచలం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నీటమునిగిన పంటలను పరిశీలించిన కలెక్టర్



బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 29 ప్రభాతవార్త:
మండలంలో కారణిమిట్ట గ్రామంలో రైతు శ్రీనివాసులురెడ్డి 7 ఎకరాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంటను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వర్షాలతో నీట మునిగినపంటలతో పాటుగా ఎంతమేర నష్టం వాటిల్లిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుఫానుతో చాలా నష్టపోయామని, తమను ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. అక్కడ ఉన్న రైతులతో యూరియా పంపిణీపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుస ుకున్నారు. తమకు ఇస్తున్న యూరియా చాలడం లేదని ఎక్కువగా ఇవ్వాలని రైతులు కలెక్టర్‌ని కోరారు. కావలసిన యూరియా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్‌డీవో కిరణ్మయి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌పై

# ఉద్యోగులు తిరుగుబాటు

- సిబ్బందిని జెసి వేధిస్తున్నారని ఆరోపణలు
- అంతర్గత విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్థిక శాఖ మంత్రి ఆదేశం

చిత్తూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త:
చిత్తూరు వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జాయింట్ కమీషనర్, ఉద్యోగుల మధ్య వివాదం రచ్చకెక్కింది. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందిని జాయింట్ కమీషనర్ తీవ్రంగా వేధిస్తున్నారని ఈ విషయంపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, సిబ్బంది రోడ్డెక్కారు. ఈ విషయంపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అంతర్గత విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమీషనర్ బాబును ఆదేశించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు చీఫ్ కమీషనర్ బాబు ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జాయింట్ కమీషనర్‌కు ఉద్యోగులు, సిబ్బందికి మధ్య గత కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. జాయింట్ కమీషనర్ ఉద్యోగులకు చులకనగా చూడటం, ప్రతి విషయానికి వేధించడం చేస్తుండటంతో వారు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కులం పేరుతో ఉద్యోగులు, సిబ్బందిని దూషించిన వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలసి జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. స్వాత్రంత్యం వచ్చి 75 వసంతాలు గడచినా ఇప్పటికీ కార్యాలయంలోకి ఎవ్వరు చెప్పులు వేసుకురాకూడదని నిబంధన పెట్టడం, సిబ్బందిని వేధించడం జాయింట్ కమీషనర్‌కు తగదని పేర్కొన్నారు.

# మొంథాతో రోడ్లు ఛిద్రం!

### తిరుపతిలో ఈ రోడ్లు బాగుచేసేదెప్పుడో!?



**మొంథా తుఫాన్ వర్ష బీభత్సం సృష్టించింది. స్మార్ట్‌సిటీ తిరుపతినగరంలోభారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగామారింది. నగరంలోని రోడ్లన్నీ దెబ్బతిని గుంతలమయంగా మారాయి. కొన్నిచోట్ల రోడ్లు కంకరతేలిపోయింది. రోడ్లు చిద్రం కావడంతో ఎక్కడ గుంత ఉందో...ఎక్కడ సాధారణరోడ్డో తెలుసుకోలేని పరిస్థితిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జోరువానలతో తిరుపతి నగరంలోని ఆర్టీసి బస్టాండ్, టిపి ఏరియా, కెటిరోడ్డు టిటిడి పరిపాలనభవనం, అలిపిరి మార్గం, తిరుచానూరురోడ్డు, గరుడవారధి క్రింద చాలా వరకు రోడ్లు వానలకు దెబ్బతిన్నాయి. ఈ రోడ్లన్నీ ఎప్పుడుబాగుచేస్తారని అటు యాత్రికులు ఇటు నగరప్రజలు ఎదురుచూస్తున్నారు. మళ్లీ వానలు రాకముందు.....ప్రమాదాలు జరగక ముందే నగరపాలకసంస్థ, ఆర్అండ్‌బి, టిటిడి అదికారులు స్పందించాలి.**

### మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాన్ని

# ఐ.జి ఆకస్మిక తనిఖీ



తిరుపతి హెల్త్, అక్టోబర్ 29, ప్రభాతవార్త
రుయా ఆసుపత్రి ఆధ్వర్యంలో మానసిక విభాగము, మత్తు వ్యసననిర్మూలన కేంద్రంలో ఐజి ఏ.రవిక్రిష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాన్ని రుయా ఆస్పత్రి సూపర్డెంట్ జె రాధ, ఆర్ఎంఓ, డాక్టర్ హరికృష్ణ పరిశీలించారు. ఐజి ఏ. రవికృష్ణ మాట్లాడుతూ మత్తు వ్యసనాలకు బానిస అయినటువంటి వాళ్లను ఈ కేంద్రంలో చేర్పించి వారి యొక్క శారీరక మానసిక బాధలు కంట్రోల్ చేసుకుంటూ మత్తు వ్యసనాలకు బానిస అయినటువంటి వాళ్లకు ఇక్కడ ప్రభుత్వం ఉచితంగా చికిత్స ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్క పేషెంట్‌తో మాట్లాడి ఇక్కడ ఆసుపత్రిలో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి ఇంకేమైనా కావాలనా అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సెంటర్‌ని ఇంకా పెద్దది చేయాలని 60 బెడ్ హాస్పిటల్ కూడా పెట్టాలని ప్రపోజల్ ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో విశాఖపట్నం తిరుపతి కర్నూలు ఈ సెంటర్లను డెవలప్ చేయాలని చెప్పారు, గంజాయికు బానిసనటువంటి వాళ్ళు వాళ్ళ యొక్క మానసిక స్థితిని ఏ విధంగా ఉంటుందో పేషెంట్లు కూడా వివరించి చెప్పారు. శారీరకంగా మానసికంగా ఆర్థికంగా సామాజికంగా మీరందరూ బాగుండాలని పేషెంట్లకు వివరించి తెలిపారు. అనుభవమైనటువంటి డాక్టర్లు సైకాలజిస్టులు నర్సింగ్ సిబ్బంది ఉన్నారని పత్రికా రూపంలో మీరు అందరికీ తెలియపరచాలని తెలిపారు.జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు వ్యసనాల పైన అవగాహన కల్పించాలని తెలుసుకోవాలని తెలుసుకున్న తర్వాత మీరు రెగ్యులర్ ఫాలోఅప్ చేయాలని ఈ మత్తు వ్యసనాల వల్ల కుటుంబం చిన్న విన్నమయి విడిపోవడం జరుగుతుందని ఆరోగ్య సమస్యలు వస్తాయని సమాజాన్ని కూడా ఇబ్బంది కలిగిస్తారని ఇలాంటి అవకాశాలు వచ్చినప్పుడు ట్రీట్మెంట్ తీసుకోవాలని విలేకరుల ద్వారా అవేర్నెస్ కలిగించాలని మీడియా మిత్రులకు కూడా చెప్పారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరిటెండెంట్ డాక్టర్ జె. రాధ, డాక్టర్ హరికృష్ణ అడిషనల్ ఎస్పీ, ఈగల్ టీం ప్రసాద్ సిఐ, డీఎస్పీలు ఎస్సైలు సీఐలు కానిస్టేబుల్స్‌లు కమల్ గిరి, డ్రగ్ డిస్ట్రిక్ట్ డైరెక్టర్ హరిప్రసాద్, డ్రగ్ ఇన్స్పెక్టర్ రీతూ, మానసిక విభాగం మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం మానసిక విభాగ అధిపతి డాక్టర్ పద్మావతి, డాక్టర్లు మానస, డాక్టర్ జి మురళి, కౌన్సిలింగ్ సైకాలజిస్టులు, నర్సింగ్ సిబ్బంది, వార్డుబాయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తీశ్వరాలయంలో అవినీతి , భూ అక్రమణలపై

# సమగ్ర విచారణ జరపాలి!

### డాక్టర్ చింతామోహన్



శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త
ప్రాంతీయ పార్టీల పాలనలో దేవాలయాల్లో అవినితి అక్రమాలు పెచ్చుపెరిగి పోతుందని మాజీ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తిలోని మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నపుడు శ్రీకాళహస్తి అలయాబివృద్ధిని పట్టించుకోక పోగా దొరికినోళ్ళకు దొరికినంత దోచుకో పరమేశ్వరా అన్నట్లు సాగిందని ధ్వజమెత్తారు. చెప్పుల కౌంటర్లో అవినీతి, సెల్‌ఫోన్ కౌంటర్లలో దోపిడి, కార్‌పార్కింగ్ సఫాయిగా దోచుకో అన్నట్లు సాగిందన్నారు. ఆలయంలో జరిగే అవినీతి జోలికి నేను వెళ్ళటం లేదు. అంతా ప్రజలు గమనిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజీవ్‌గాంధీ పేరు మీద కాంగ్రెస్ పార్టీ పాలనలో శ్రీకాళహస్తిలో వేలాది మందికి ఇండ్లు మంజూరు చేసామన్నారు. నేడు ఇళ్లు కట్టుకున్న వారి నుంచి సొమ్ములు వసూలు చేసుకుంటున్నారని మాజీ మంత్రి శివమెత్తారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 20వేల ఎకరాల భూములు స్వాహా చేసారు.లక్షల కోట్లు దిగమింగారు. జిల్లా కలెక్టర్ సిఎం చంద్రబాబునాయుడు ఎందుకు జోక్యం చేసుకోరని చింతామోహన్ ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి ఎవరు స్వాహా చేసారో నిగ్గు తేల్చాలని కోరారు.

పరిశ్రమలకు దోచిపెడుతున్నారు:
కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో తాను మంత్రిగా ఉన్నపుడు కేంద్ర ప్రభుత్వం తిరుపతి లోక్ సభ పరిధిలో 300 పరిశ్రమలు వచ్చాయి. లక్ష మంది ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. శ్రీసిటి, మేనకుర్,కృష్ణపట్నం పోర్టు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసామన్నారు. పరిశ్రమల ఏర్పాటులో ఉద్యోగాల కల్పనలో యూపిఏ ప్రభుత్వం చేసినట్లుగా ఎన్టిడియే ప్రభుత్వం చేయటం లేదని చింతామోహన్ అభిప్రాయపడ్డారు. రూ.14.50 లక్షల కోట్లు రూపాయలు బ్యాంకులు రుణమాఫీ చేసాయి. రూ.100కోట్లు పైబడిన కోటీశ్వరులు రుణాలు మాఫీ చేశారన్నారు. ఏ రాష్ట్రంలో ఎవరెవరికి ఎంత రుణమాఫీ చేశారో ప్రధాని నరేంద్రమోదీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ చింతామోహన్‌తో పాటు డాక్టర్ ఎస్ బత్తెయ్యనాయుడు, నరేంద్ర నాయుడు, సమీవుల్లా,కూలి రవి, జనార్ధన్‌రెడ్డి శివయ్య, వవెంకటముని తదితరులు పాల్గొన్నారు.

### మేయర్ కఠారి దంపతుల హత్య కేసు

# నిందితులకు నేడు శిక్ష ఖరారు



(ఫైల్‌ఫోటో)

చిత్తూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త:
పదేళ్ళ క్రితం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన అప్పటి మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల హత్య కేసు తీర్పు గురువారం వెల్లడికానుంది. గత వారం రోజులుగా మేయర్ దంపుతల హత్య కేసు నిందితులకు శిక్ష వాయిదా పడుతూ వస్తున్న నేపథ్యంలో గురువారం ఈ కేసుకు సంబంధించి తుది తీర్పు వెల్లడికానుందని సర్వత్రా భావిస్తున్నారు. మేయర్ దంపతుల హత్య కేసు గురువారం వెల్లడి కానుండటంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకులు సికె బాబు ఇళ్ళ వద్ద పోలీసు బందోబస్తు కల్పించారు. అలాగే ఈ కేసు తీర్పు వెలువరించనున్న జడ్జి శ్రీనివాసరావు ఇంటి వద్ద సైతం పోలీసులు గట్టి భద్రతా ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం కోర్టు నిందితులుగా నిర్ధారించిన ఐదు మంది సోమవారం జడ్జి ఎదుట తమ వాదనలు విన్పించగా మరోవైపు ఇరు కక్షిదారుల న్యాయవాదులు సైతం జడ్జికి వాదనలు విన్పించారు. ఈ క్రమంలో జడ్జి గురువారం నాటికి నిందితులు ఐదు మందికి చెందిన నిందితుల సామాజిక పరిస్థితి, నిందితుల వైద్య నివేదికలు, జైలులో నిందితుల ప్రవర్తనపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో గురువారం నిందితులకు శిక్ష ఖరారు అవుతుందని చిత్తూరు ప్రజానీకం భావిస్తున్నారు. ఈ మేరకు చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాలల్లో ఈ కేసు తీర్పుపై ప్రజల్లో ఉత్కంఠత నెలకొంది.

## చిరుత పులి దాడిలో పాడి ఆవు మృతి



కాణిపాకం, అక్టోబర్ 29 ప్రభాతవార్త:
చిరుతపులి దాడి చేసి ఆవును చంపి తిన్న సంఘటన మంగళవారం రాత్రి కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐరాల మండలం పుత్రమద్దిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు పుత్రమద్ది హరిజనవాడకు చెందిన భాస్కర్ తన పాడి ఆవును మంగళవారం గ్రామానికి సమీపంలో ఉన్న ఈచనేరి అడవిలోని మూలకుంట వద్ద మేత కోసం వదిలాడు. మేతకు వదిలిపెట్టిన పాడి ఆవు రాత్రి ఇంటికి చేరుకోలేదు. దీనితో బుధవారం ఉదయం వెళ్లి చూడగా ఆవు తీవ్ర గాయాలతో మృతి చెంది పడి ఉంది. చిరుత పులి ఆవు మీద దాడి చేసి చంపినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. చిరుత పులి తొలుత ఆవు మీద దాడి చేసి గొంతు కొరికి రక్తం తాగిన తర్వాత ఆవు పొదుగు పూర్తిగా తినగా శరీర భాగాన్ని అక్కడే వదలి వెళ్లిపోయినట్లు సంఘటనా స్థలాన్ని బట్టి తెలుస్తోంది. బాధిత రైతు వెంటనే ఈ విషయాన్ని మండల, అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీనితో మండల డిప్యూటి రేంజ్ ఆఫీసర్ రాకేష్‌కుమార్, ఎఫ్‌బిఓ లావణ్యలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆవు మృతదేహానికి పశువైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. అలాగే బాధిత రైతుకు నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వారు తెలిపారు. ఇదిలా వుండగా గత మూడు రోజుల క్రితం తవణంపల్లి మండలం కొండ్రాజుకాల్వ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి చెందిన మూడు మేకలను పులి చంపి అడవుల్లోకి తీసుకెళ్లినట్లు వార్తలు వచ్చాయి. మూడు రోజులకు కూడా గడవక ముందే పుత్రమద్ది గ్రామంలో ఆవు చిరుత బలి కావడం విశేషం.

# ప్రమాదకరంగా వకుళమాత ఆలయ ప్రధాన రహదారి





తిరుపతిరూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయ ప్రధాన రహదారి కృంగిపోయి, పెద్ద గుంత ఏర్పడింది. రోడ్డుకు కిందభాగాన పెద్ద డోంక ఏర్పడి ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. టిటిడి ఆర్చికి కిందనే రోడ్డుకి దొంక ఏర్పడి, రోడ్డు కూలే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరుతో ఆర్చి పిల్లర్ కింద నేల కుండి పోయి ఉంది. ఇలానే వదిలేస్తే ఆర్చికి కూలే ప్రమాదం ఉందంటున్నారు. రోజురోజుకు గుంత విస్తరించడంతో వాహనదారులు జాగ్రత్తగా వెళ్ళాల్సి వస్తోంది. రాత్రివేళల్లో ఈ ప్రాంతంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది.

**మురుగునీరు-తాగునీరు ఒకే దారిలో!**

ఆర్చి సమీపంలో ఆలయానికి సంబంధించిన డ్రైనేజ్ వ్యర్థాలు సమీపంలోని పంచాయతీ ఖాళీ స్థలంలో వదిలిపెడుతున్నారు. ఫలితంగా ఈ ప్రదేశంలో మురుగునీరు నిల్వచేరి దుర్వాసన వ్యాపిస్తోంది. అదే ప్రాంతంలో గ్రామానికి నీరు సరఫరా చేసే పివిసి పైప్‌లైన్ వెళ్ళుతుంది. పైప్‌లైన్‌లో ఎక్కడైనా లీకేజ్ ఏర్పడితే మురుగునీరు తాగునీటిలో కలిసే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

**కాలువ పనులు అర్థాంతరంగా....పరిసరాలు అస్తవ్యస్తం**

కళ్యాణ మండపం వెనక నుంచి వర్షపునీరు బయటకు పంపేందుకు కాలువ నిర్మాణ పనులు ప్రారంభించినా మధ్యలోనే ఆపేశారు. కాలువ ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు బయటకు వెళ్ళే మార్గం లేక ఆగిపోతుంది. దీనివల్ల దోమల పెరిగి దుర్వాసనతో చుట్టుపక్కల ప్రాంతం వర్షపు నీటితో మునిగి ఉంది.

**పాచిపట్టి పాడైన కోనేరు**

శ్రీవకుళమాత ఆలయ కోనేరు నిర్వాహణ లోపం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.



సక్రంగా నిర్వహణ చేయనందున కోనేరు పాచిపట్టి ఉండటానికి భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోనేరు శుభ్రతపరిచి, ఆహ్లోదకరంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

**ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే**

స్థానికులు, భక్తులు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఇంజనీరింగ్ అధికారుల నుంచి స్పందన లేదని వాపోతున్నారు. రోడ్డు కింద కృంగిపోయిన ప్రదేశాన్ని సరిచేసి, డొంకకు మరమ్మత్తు చేయాలని కోరుతున్నారు. ఆర్చి వద్ద పునరుద్దరణ పనులతో పాటు భద్రత బలపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

**వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**

ఆలయ ప్రాంగణం అందంగా కనిపించాలన్నా...పర్యాటకులు ఆకర్షితులు కావాలంటే ఈ ప్రదేశంలో వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేయాలని స్థానికులు భక్తులు కోరుతున్నారు. ఆలయ ప్రాంగణం పచ్చదనంతో అలరారేలా మారితే భక్తులకు కూడా ఆధ్యాత్మికతతో పాటు ప్రశాంతత కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

## నీరు నిల్వ లేకుండా పక్కా చర్యలు

మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం



**చిత్తూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా పక్కా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మున్సిపల్ అధికారులతో కలిసి మంగళవారం రాత్రి సంతపేట, వీరభద్రకాలనీ, దోభిఘాట్, తోటపాళ్యం తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు తగ్గడంతో వీధులు, ఇళ్ళ మధ్య వున్న నీటిని తొలగించడానికి వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కమీషనర్ ఆదేశించారు. నీటి ప్రవాహం అధికంగా వున్న ప్రాంతాల్లో కాలువలను వెడల్పు చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్ర మాలను పకడ్బందీగా చేపట్టాలని, దోమలు విజృంభించకుండా పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నీటి పైపులైన్లను పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఇంజనీరింగ్, ప్రజారోగ్యవిభాగంఅధికారులు, వార్డు కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాలు ఏర్పాటుకు సహకారం

– నూతన రెడ్‌క్రాస్ రక్తకేంద్రం భవనంను పరిశీలించిన కలెక్టర్ సుమత్‌కుమార్

**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:**



జిల్లాలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడానికి సహకరం అందించడంతో పాటు రెడ్ క్రాస్ రక్తకేంద్రం లైసెన్సు మంజూరు, రక్తకేంద్రం మార్పిడి, సభ్యత్వ నమోదుపై సహకారం అందిస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. పలమనేరు రోడ్డులో పిజిసిఐఎల్ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన రెడ్‌క్రాస్ రక్త కేంద్రంను బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ రక్తకేంద్ర లైసెన్సు మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నూతన భవనంను ప్రారంభించి ప్రజల అవసరార్థం సేవలను సత్వరం ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సప్తగిరి గ్రామీణ బ్యాంకు ద్వారా రక్త కేంద్రంకు క్యాంపు వాహనం, లక్ష్మీనగర్ కాలనీలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌కు సిఆర్ఎస్ నిధులు సమకూర్చడం, రక్త కేంద్రంలో అసంపూర్తిగా వున్న మొదటి అంతస్తు పనులను సొంత నిధులతో పూర్తి చేస్తామని రెడ్ క్రాస్ కోశాధికారి డాక్టర్ ఎం.తేజోమూర్తి హామీ ఇచ్చారు. అలాగే మార్గదర్శి చిట్ ఫండ్స్ ఎంపి శైలజ సిఎస్ఆర్ నిధులతో రెండవ అంతస్తు నిర్మాణం చేపట్టడానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేశారు. రెడ్‌క్రాస్ భవన నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పంచాయతీరాజ్ ఇంజనీర్ల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ వి.రమేష్‌బాబు, వైస్ ఛైర్మన్ గోవర్ధన్‌బాబీ, కోశాధికారి డాక్టర్ ఎం.తేజోమూర్తి, రక్తకేంద్ర వైద్యాధికారులు డాక్టర్ జయశంకర్, డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ పరిపాలన అధికారి వి.గోపి, జిల్లా కో–ఆర్డినేటర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి వారణాసి మహాక్షేత్రంలోని శ్రీ కాశీ విశ్వనాథ్‌స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీజ్ఞాన ప్రసూనాం బసమేత శ్రీకాళహస్తీశ్వరుని కళ్యాణోత్స వాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పెద్ద దేవాలయాలకు సంబంధించి దేశవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించుటకు ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కార్తీక మాసంలో వారణాసిలో అద్భుతంగా నిర్వహించబడుతుందని ఇక్కడకు దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తారు కాబట్టి శ్రీకాళహస్తీశ్వరాలయ దివ్యక్షేత్ర ప్రాశస్త్యం తెలిసే విధంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్స వాన్ని ఏర్పాటు చేసారు., ఈకార్యక్రమాలను ఆలయం పర్యవేక్షకులు విజయసారథి, వేదపండితులు త్రినాథ్ స్వామి మారుతీరాం, సతీష్, రమేష్‌లు నిర్వహించగా జూనియన్ అసిస్టెంట్ మహేష్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## జిల్లాలో ప్రధాన్ మంత్రి కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం వేగవంతం

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :



2019 మార్చిలో ప్రారంభించిన ప్రధాన్ మంత్రి కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద తిరుపతి జిల్లాలో సౌర విద్యుత్ ఉత్పత్తి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు 2024 లో డిసెంబర్ నెలలో ఈ పథకాన్ని అమలు ప్రారంభించడంజరిగిందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ వారు తిరుపతి జిల్లాలో 25 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇందుకు సంబంధించిన టెండర్లను పిలిచామని, టెండర్ ప్రక్రియలో మోహన్ స్పిన్ టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఈ పనులు అప్పగించబడ్డాయన్నారు. సంస్థ అధికారులు 25 ఏం డబ్ల్యు సామర్థ్యంతో కూడిన ప్లాంట్ ఏర్పాటు కోసం సర్వే నిర్వహించి, శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని పోలీ గ్రామంలో 70 ఎకరాలు మరియు మేర్లపాక గ్రామంలో 30 ఎకరాలు, మొత్తంగా 100 ఎకరాల భూభాగాన్ని అనువుగా గుర్తించారని, భూమి పరిశీలన అనంతరం సంబంధిత కలెక్టర్ పోలీ గ్రామంలో 58 ఎకరాల భూమిని మంజూరు చేశామని. ఈ భూమిలో 16 ఎమ్ డబ్ల్యూ సౌర ప్లాంట్ ఏర్పాటు చేయడం సాధ్యమని సంస్థ తెలిపిందన్నారు. మిగిలిన 12.4 ఏండబ్ల్యు ప్లాంట్ ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

## చంద్రన్న సత్యవేడు సంగతి చూడన్నా...

**సత్యవేడు, అక్టోబరు 29 ప్రభాతవార్త:**



కొత్త జిల్లాలు...కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాట్లపై ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా సత్యవేడు మహాత్మగాంధీ విగ్రహం సాక్షిగా, సార్వత్రిక ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నియోజకవర్గకేంద్రమైన సత్యవేడులోనే రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలనఉ తమ ఇష్టానుసారం వివిధ డివిజన్ కేంద్రాలకు చేర్చడం జరిగిందన్నారు. ఈ కారణంగా నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి చిన్న రెవెన్యూ సమస్యకు భారీగా రైతులు ముడుపులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందు వల్ల అన్ని కోణాల్లో ఆలోచించి టీడీపీకే అధికారం ఇవ్వండి ఆదిమూలంను గెలిపించండి..నేను చేస్తా సత్యవేడును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా...అంటూ చంద్రబాబు ఎన్నికల బహిరంగ సభలో హామీ ఇచ్చారు. విశాలమైన భవనాలు ఉన్న సత్యవేడులో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు అవుతుందని, ఈ కేంద్రం ద్వారా శ్రీసిటీకి భూసేకరణ పనులు సులువుగా జరగడంతో పాటు, రెవెన్యూశాఖ పరంగా ఏడు మండలాల్లో ఉన్న భూ సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం అవుతాయని, నియోజకవర్గ వాసులు ఎదురుచూసిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించి స్పందించాలని నియోజకవర్గ ప్రజలు కోరారు.

***అసెంబ్లీలో కూడా...***

ఇక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూడా ఇటీవలజరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సత్యవేడులో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన చంద్రబాబు హామీని ప్రస్తావించడం కూడా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రన్న సత్యవేడు బహిరంగ సభలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని నియోజకవర్గ వాసులు కోరుతున్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

### కమిషనర్ ఎన్.మౌర్య.

తిరుపతి కార్పొరేషన్ అక్టోబర్ 29 ప్రభాతవార్త



వర్షాల వలన నగరంలోని ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని స్కావేంజర్స్ కాలనీ, అబ్బన్న కాలనీ, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. తుఫాన్ వలన గుంతలు పడ్డ రోడ్లు, మురుగునీటి కాలువలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాల వలన అక్కడక్కడా నిలబడ్డ వర్షపు నీటి వలన అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఎక్కడ వర్షపునీరు, చెత్త లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నీరు ఆగిన్న ప్రాంతాల్లో మలాథిన్ పిచికారీ చేయాలని, ఆయిల్ బాల్స్ వేసి గోమల లార్వా వృద్ధి చెందకుండా చూడాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా అన్ని వార్డుల్లో ప్రతిరోజూ పాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. వర్షం వలన పాడైనా రోడ్లు, మురుగునీటి కాలువల ను మరమ్మత్తు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట 33 వ వార్డు కార్పొరేటర్ దూది కుమారి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఏసిపి మూర్తి, డి.ఈ లు రాజు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

## వృద్ధులు..వికలాంగులకు ఉచితంగా చలిదుస్తులు పంపిణీ



**కుప్పం, అక్టోబర్ 29ప్రభాతవార్త** కుప్పం సమాచారం సొసైటీ సభ్యుడు అర్షన్ తన జన్మదినం సందర్భంగా స్థానికంగా రోడ్డు పక్కన ఉంటున్న వృద్ధులు, వికలాంగులకు చలిదుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా సొసైటీ సభ్యుఉ మాట్లాడుతూ మానవ సేవలో భాగంగా సాటి మనిషికి సాయం చేయడంలో ఎంతో ఆన ందం ఉందన్నారు. ఏటా శీతాకాలంలో తాము వృద్ధులకు తమచేతనైన సాయం అందిస్తున్నట్లుచెప్పారు. ముమ్ముందు మరికొంత మందికి ఉచితంగా చలిదుస్తులు అందిస్తామ న్నారు. కార్యక్రమంలో రాజువేలు, చంద్ర, మతీన్, గని, సురేష్, లాలు, ఖలీమ్, ఇస్మాయిల్, ప్రవీణ్, సోము, అజీమ్, యారబ్, గురుస్వామి, ప్రవీణ్, రామూర్తిపాల్గొన్నారు.

## వైకాపానువీడి తెదేపాలోకి ముప్పై కుటుంబాలు



**కుప్పం, అక్టోబర్ 29 ప్రభాతవార్త** గుడుపల్లె మండలం కంచింబందార్లపల్లికి చెందిన సుమారు ముప్పై కుటుంబాలు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలోచేరారు. ఈకార్యక్రమం స్థానికతెదేపా కార్యాలయంలో జరిగింది. పార్టీలోచేరిన వారికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు తదితరులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో నేతలు హేమా ంబర గౌడు, ఎస్ఆర్ చంద్ర పాల్గొన్నారు.

## విద్యార్థులు జీవితంలో లక్ష్యాలు ఎంచుకోవాలి - కడ పి.డి.వికాస్ మర్మత్



**కుప్పం, అక్టోబర్29ప్రభాతవార్త** విద్యార్థులు చిన్నతనం నుంచే జీవితంలో తమ లక్ష్యాలు ఎంచు కుని ఆది శగా పయనించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సూచించారు. బుధవారం కడ కార్యాలయంలో స్థానిక టేలర్‌స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయన కెరీర్ గైడ్‌లైన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థిదశలో పదవ తరగతి ఎంతో ముఖ్యమన్నారు. ఈ విషయం గుర్తు ంచుకుని విద్యార్థులు బాగా చదవాలన్నారు. పట్టుదలతో ఇష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలు గుర్తుంచుకోవాలని వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డా॥ సుదర్శన్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, ప్రిన్సిపాల్ అక్షయ్ చౌహాన్, వైస్‌ప్రిన్సిపాల్ సంగీత కన్నన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ డైరెక్టర్‌కు కొత్తపేట నేతలచే ఘనసన్మానం



**కుప్పం, అక్టోబర్ 29 ప్రభాతవార్త** రాష్ట్ర బెస్తకుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్ ప్రకాష్‌ను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కొత్తపేట తెదేపా ఇన్‌చార్జ్ ముఖేష్(అప్పు)అధ్వర్యంలో నేతలు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తిరుమగళ్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ సురేష్‌బాబులకు కృతజ్ఞతలుతెలిపారు. బెస్తకులస్తులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం తరపున అర్హులకు పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. నేతలు వరదరాజులు, హరినాథ్ గౌడ్, సుకుమార్, లోకి, తాండవ, అంజి పాల్గొన్నారు.

## పార్టీ నేతలు సమన్వయంతోపనిచేయాలి

కుప్పం, అక్టోబర్29 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండల పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ కోరారు. బుధవారం వసనాడులో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో అఖండ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో కడ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, కో ఇన్‌చార్జ్ వేడి, నేతలు వల్లెప్ప, మురళి, చెక్కునత్తం మణి, సంతోష్, విభూషణ్, గుణశేఖర్, శివ, రాజా, శరవణ, చరణ్, సుబ్బు, శివ, కనకరాజ్, రియాజ్, బాబుపాల్గొన్నారు.

## కమతమూరు అభివృద్ధికి తగు చర్యలు

కుప్పం, అక్టోబర్ 29 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి కమతమూరు గ్రామ అభివృద్ధికి తగుచర్యలు తీసుకుంటామని కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్, కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం వీరు గ్రామంలో పర్యటించి స్థానికంగా ఉన్నసచివాలయ భవనం, రోడ్లు, డ్రైన్లను పరిశీ లించారు. గ్రామంలో కొత్తగా డ్రైన్ల నిర్మాణంకు చర్య లు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## శ్రీ ముత్తుమారెమ్మ ఆలయ పూజారి మృతి

కుప్పం, అక్టోబర్29 ప్రభాతవార్త

స్థానిక శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయంలోని శ్రీ ముత్తుమారెమ్మ ఆలయ పూజారి కరుణ శేఖర్ మృతి చెందారు. ఈయన గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూబుధవారం మృతి చెందారు. ఈయన మృతి పట్ల ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, అర్చకులు సోమశేఖర శాస్త్రి, కమిటీ సభ్యులు, పూజారుల బృందం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

శాంతిపురం, అక్టోబర్29 ప్రభాతవార్త



మండలంలోని గ్రామాల్లో ప్రజలకుపారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఎంపిడిఓ పిఆర్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలకు 23 ఇ–ఆటోలు, 10 ట్రైసైకిళ్లను ప్రభుత్వం మంజూరుచేసిందన్నారు. 59మంది క్లాప్‌మిత్రలు నిత్యం ఇంటింటి చెత్తసేకరణచేసి చెత్తనుంచి సే ంద్రీయ ఎరువులు తయారీకి చర్యలుచేపట్టామన్నారు. ప్రతి సిఆర్‌పి గ్రామాల్లో విధిగా పర్యటించి ప్రజకు పరిసరాల శుభ్రత, అంటువ్యాధులపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డి.ఎంపిడిఓ ఈశ్వరన్, డిఆర్‌పి ఆంజనేయులు, ఎ ంసిఓ వాసు పాల్గొన్నారు.

## గోకులం షెడ్లు సకాలంలో పూర్తిచేయాలి

శాంతిపురం, అక్టోబర్29 ప్రభాతవార్త



మండలంలో గోకులం షెడ్ల నిర్మాణాలను రైతులు సకాలంలో పూర్తిచేయాలని ఎంపిడిఓ పిఆర్ కుమార్ కోరారు. బుధవారం కోతిగుట్లపల్లిగ్రామంలో ఆయన గోకులం షెడ్లనుపరిశీలించారు. ఈసందర్భంగా కొందరు రైతులు ఇంకా బిల్లులు రాలేదని తెలుపగా బిల్లుల చెల్లింపుకుచర్యలుచేపట్టామన్నారు. మండలానికి రెండు విడతల్లో 255 గోకులం షెడ్లు మంజూరు కాగా 126 పూర్తయ్యాయన్నారు. 63షెడ్లనురైతులుత్వరగా ప్రారంభించి పనులు పూర్తిచేయాలన్నారు. లేకుంటే రద్దు చేసా _మన్నారు. కార్యక్రమంలో టిఎ ధర్మలింగం, ఎఫ్ఓ సుబ్రమణ్యం, నేతలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

రామకుప్పం, అక్టోబర్29 ప్రభాతవార్త



రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధికి కమిటీలు ఏర్పాటుచేయనున్నట్లు గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగినసమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాలతో ప్రతి మండలంలో గ్రంథాలయాలు ఉండాలని ఆదేశించారన్నారు. కుప్పంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణంకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నేతలు పట్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, నరసింహులు, సీతాపతి, రామూర్తి, చలపతి, చిని న్కృష్ణ, కృష్ణనాయక్, గంట్లప్పగౌడు, గుర్రప్ప, విశ్వనాథ్, వె ంకటరామగౌడు, వెంకటా చల ం, మునిరెడ్డి, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు పంపిణీ

కల్లూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త

పులిచెర్లలో బుధవారం భారత రాజ్యాంగం అమలుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేఘన ప్రథమ స్థానం, వక్తృ త్వం పోటీలో పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ ద్వితీయ స్థానం, క్విజ్ పోటీలో పులిచెర్ల ఎంజెపిఏపి గురుకుల పాఠశాల విద్యార్థిని వేదశ్రీ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, హెచ్ఎం లక్ష్మీదేవి, సిఆర్‌పి వేణుగోపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎస్సీ ఎస్టీ పోస్టులు భర్తీ చేయండి

పుంగనూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త



టిటిడిలో ఎస్సీ ఎస్టీ పోస్టులు భర్తీ చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బాణావత్ మునేంద్రనాయక్ కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ ను కోరారు. బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్, వి. రాజ్ కుమార్, పాలకుంట శ్రీనివాసులు ఈవోను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయాలని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువ భాగం ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఆలయాలు మరియు భజన మందిరాలు నిర్మించాలని, టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించడం లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పాటించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన గోవింద కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## విజయవంతమైన రక్తదాన శిబిరం

పుంగనూరు అక్టోబర్ 29 ప్రభాతవార్త



పోలీసు అమరవీరుల సంస్మరణ సందర్భంగా సిఐ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జరిగిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. పట్టణంలోని బిఎంఎస్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని సంఘాల యువకులు పాల్గొని పెద్ద ఎత్తున రక్తదానాలు చేశారు. మనిషిగా ప్రపంచానికి ఏదైనా ఇవ్వగలడం అంటే రక్తదానం మహోన్నతమైనటువంటి దానమని సీఐ సుబ్బారాయుడు అన్నారు. పట్టణ సంఘాలతో పాటు పార్టీల శ్రేణులు కూడా ఇందులో పాల్గొని విజయవంతం చేశాయి.

## కలెక్టర్‌తో జనసేన నాయకులు

పుంగనూరు అక్టోబర్ 29 ప్రభాతవార్త



మంగళవారం జనసేన పార్టీ నేతలు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్నా రాయల్, పీలేరు ఇన్‌చార్జ్ బెజవాడ దినేష్ , తిరుపతి నగర ఉపాధ్యక్షులు పార్థులు జిల్లాలో మరియు నియోజకవర్గం లో జరుగుతున్న ప్రభుత్వ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విభిన్న శాఖల నుండి వచ్చే అప్డేట్స్‌ను కూటమి ప్రభుత్వ భాగస్వామి అయిన జనసేన పార్టీకి కూడా సమయానుకూలంగా పంపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి మరియు పుంగనూరు నియోజకవర్గం నిర్ణయాల్లో భాగస్వామ్య భావనతో వ్యవహరించాలని కోరారు. "మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా మరియు పుంగనూరు ప్రజల భద్రతకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ కారణంగా జరిగే జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయంతో వ్యవహరిస్తామని, తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖలకు ఇప్పటికే తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల భద్రతకు సంబంధించి పూర్తి స్థాయిలో సన్నద్ధత చర్యలు కొనసాగుతున్నాయని ఆయన భరోసా ఇచ్చారు.

## దేవరెద్దుకు ప్రత్యేక పూజలు

సదుం అక్టోబర్ 29 ప్రభాతవార్త



మండల పరిధిలోని మొరవ పల్లె పంచాయతీ చీకలు చేనులో బుధవారం దేవరెద్దు కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవర ఎద్దును ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి మారు పొంగల్ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

సదుం, అక్టోబర్ 29 ప్రభాతవార్త



సదుం గ్రామపంచాయతీ దిగువ జాండ్రపేటలోని కొత్తగా నిర్మించిన శ్రీ మహాగణపతి సాయిబాబా శ్రీ సీతారామస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేకం ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమైనాయి. ఇందులో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేయనున్న విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు శాంతి, వివిధ రకాల హోమాలు నిర్వహించి వేదపారాయణం జరిపించారు. అదేవిధంగా గురువారం విగ్రహ ప్రతిష్ట చేసి అనంతరం 31వ తేదీ ప్రాణ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, కళ్యాణోత్సవం జరిపిస్తామని వ్యవస్థాపకులు ఎద్దుల నాగభూషణం, గిరిజకుమారి తెలిపారు.

## వ్యాధులపై కేజీబీవీ విద్యార్థులకు అవగాహన

యర్రావారిపాలెం, అక్టోబర్ 29, ప్రభాతవార్త:



యర్రావారిపాలెం మండలంలోని యర్రావారిపాలెం కేజీబీవీ కళాశాల నందు విద్యార్థులకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపియన్‌లో భాగంగా కోర్ సంస్థ ఆధ్వర్యంలో పలు వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోర్ సంస్థ ప్రతినిధి తులసి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పలు వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీబీ, ఎస్టీఐ, హెచ్ బీసాగ్, హెచ్ఐవి ఎలా వస్తుంది, వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే కేజీబీవీ ప్రిన్సిపాల్ షర్మిల మాట్లాడుతూ యుక్త వయసులో విద్యార్థులు ఆకర్షణకులోనై చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలన్నారు. విద్యార్థి దశ నుంచే అన్ని వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులునాగేశ్వరి, అర్చన, భారతి, ప్రత్యుష, కోర్ సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దారి సమస్యను పరిష్కరించండి

సదుం అక్టోబర్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామం. శివపురంలో సర్వే నెం.6/2లోతాము నిర్మించుకున్న ఇంటికి దారి సౌకర్యం కల్పించాలని వీరయ్య కుమారుడు కృష్ణయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తాము ఇంటికి కరెంటు బిల్లు మరియు పంచాయితీ వారికి ఇంటి పన్ను కూడా కడుతున్నామని చెప్పారు. సుమారు 15 సంవత్సరముల నుండి ఇంటికి దారి పూర్తిగా లేదు. చుట్టూ వంకలు వున్నవి. వర్షాకాలంలో వరదు వస్తాయి. పాములు ఎప్పుడు ఏ వైపునుండీ వస్తాయో తెలియక నిరంతరం ప్రాణాలు అరచేతిలో పట్టుకొని దిన దిన గండంగా జీవనం సాగించుకొనుచున్నామని అన్నారు. గతంలో సర్వేయర్ వచ్చి దారికి చూపించారని అయితే చుట్టుపక్కల ఉన్నవారు దారిని అడ్డుకుంటున్నారని వాపోయారు. దారి కావలెనని సదుంమండలతహశీల్దారుకువినతిపత్రంఅందజేశామని ఇప్పటి దాక ఎవరు స్పందించలేదని వాపోయారు.

## అవినీతిని నిర్మూలిద్దాం- సమాజాన్ని మారుద్దాం

చిత్తూరురూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త:

భారతదేశం అవినీతి లేకుండా అభివృద్ధి చెందిన దేశంగా మారడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుపతి అవినీతి నిరోధకశాఖ ఇన్స్పెక్టర్ వి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరుపట్టణం, శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల నందు బుధవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను పురస్కరించుకొని ప్రిన్సిపాల్ డా.మనోహర్ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటుచేసారు. వెంకటరమణ మాట్లాడుతూ సమాజం సుస్థిరంగా అవినీతి రహితంగా న్యాయవంతంగా వుండేలా చూడడం అవినీతి నిరోధకశాఖ బాధ్యతని ఉద్యోగులు, వ్యాపారులు అందరూ పారదర్శకతతో పనిచేస్తే దేశం ఉన్నతస్థితికి చేరుతుందని పేర్కొంటూ విద్యార్థుల సందేహాలను నివృతి చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డా. జి.ఉషారాణి, హిందీ అధ్యాపకురాలు డా. షమ్స్ అక్తర్, ఆంగ్ల అధ్యాపకులు డా.బి. తిరుకుమార్, కామర్స్ అధ్యాపకులు డా. రమాదేవి, కంప్యూటర్‌సైన్స్ అధ్యాపకులు జ్ఞాపిక, డా. నాగజ్యోతి, డా. ధర్మమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన

చిత్తూరురూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త:



సాంకేతికను ఆసరాగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి మోసాలకు విద్యార్థులు గురి కాకుండా సైబర్ నేరాల పట్ల ప్రతి విద్యార్థి పూర్తి అవ గాహన కలిగి వుండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిఎస్పీ సాయినాథ్ పేర్కొన్నారు. బుధవారం పివికెయన్ ప్రభుత్వకళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి అధ్యక్షన నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఏసిబి) వెంకటరమణ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యంగా మొబైల్ ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయనీ, విద్యార్థులు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచులతో పంచుకోవద్దని, పేటియం, గూగుల్‌పే, ఫోన్‌పే తదితరవాటి కెవైసిలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లను సందర్శించకూడని, ఫోన్ చేసి పోలీస్ అధికారులమని నేరస్తులు, సైబర్ నేరగాళ్లు బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యస్వీయూలో ఎం.టెక్,ఎం ఫార్మసీ, బి.ఫార్మసీ కోర్సుల్లో

ప్రత్యేక ఫీజు సీట్లకు అడ్మిషన్లు

**తిరుపతి విద్య, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ లో యం.టెక్ కోర్స్(కెమికల్, సివిల్,కంప్యూటర్, ఎలక్ట్రికల్,కమ్యూనికేషన్స్,మెకానికల్, ఇంజనీరింగ్), యస్వీయూ ఫార్మసీ కళాశాలలో యం.ఫార్మసీ , బి. ఫార్మసీ కోర్సులలో ప్రత్యేక ఫీజు చెల్లింపు సీట్లలో,చేరదలచిన విద్యార్థులు వెంటనే (30/10/2025 నుంచి)డైరెక్టర్రేట్ ఆఫ్ అడ్మిషన్లను సంప్రదించవలసిందిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కేటగిరీ క్రింద యం.టెక్ చేరడానికి గేట్ 2025 మొదటి ప్రాధాన్యత,, ఏ.పి పి.జి ఈసెట్ 2025 రెండవ ప్రాధాన్యత, కేవలం బి.టెక్ వారికి చివరి ప్రాధాన్యత అడ్మిషన్లలో ఇవ్వబడుతుందని వారు చెప్పారు. అలాగే యం. ఫార్మసీ కోర్సుల్లో చేరడానికి జీ ప్యాట్ 2025 వారికి మొదటి ప్రాధాన్యత, ఏ.పీ పి.జి ఈసెట్ 2025 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, కేవలం బి. ఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అదేవిధంగా బి.ఫార్మసీలో చేరడానికి ఈ. ఏ.పి.సెట్ 2025 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత,కేవలం ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.యం.టెక్ కోర్స్ కు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1,45,170 రూపాయలు యం. ఫార్మసీ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1,53,940రూపాయలు,బి.ఫార్మసీ కోర్సు కు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 81000రూపాయలు చెల్లించవలసి ఉంటుందని వారు తెలిపారు.డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్వీయూనవర్సిటీ. ఈడియూ.ఐన్./ డిఓఏవెబ్సైట్ చూడవచ్చని తెలియజేశారు. ఈ అడ్మిషన్ ప్రక్రియ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ చేపడుతుందని తెలిపారు .

## కాళంగి నది ఏరును పరిశీలించిన శంకర్‌రెడ్డి

**కేవీబీ పురం, అక్టోబరు 29 ప్రభాతవార్త:**



మొంథా తుఫాను ప్రభావంతో కేవీబీ పురం మండలంలోని రాజుల కండ్రిగ నుంచి ఎగువపూడికి వెళ్లే మార్గమధ్యలో ఉన్న కాళంగి నది ఏరును సత్యవేడు టీడీపీ పార్టీ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం రాజుల కండ్రిగ పూడి మధ్యలో ఉన్న ఏరుని పరిశీలించి, పూడి చెన్నకేశవపురం, పోలినాయుడు గుంట, దిగువ పూడి గ్రామ ప్రజలను పరామర్శించారు. కనబడతారు...పోతారు హామీలు ఇస్తారే తప్ప సుమారు 40 సంవత్సరాలుగా వంతెనని బాగు చేయలేదని శంకర్‌రెడ్డికి విన్నవించారు. ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే గోవర్ధన్ గిరిజనులకు రోడ్డు, ఎస్టీ కాలనీకి వంతెన నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇచ్చారు. గిరిజన కాలనీకి కాజ్‌వే వంతెన నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవోతో మాట్లాడి ఎస్టీ కాలనీకి శ్మశాన దారి ఏర్పాటు చేయించాలని శంకర్‌రెడ్డిని కోరారు. కొట్టాలమిట్ట గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలుతో శంకర్‌రెడ్డి సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోశయ్య, వీఆర్వో స్వామి, మండల నాయకులు రాష్ట్ర నాయకులు మొగిలి మునస్వామి యాదవ్,పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, సర్పంచ్‌లు వెంకటేష్‌నాయుడు, ఎర్రం దొరబాబునాయుడు, బ్రాహ్మణపల్లి సర్పంచ్ రవి, కూటమి నాయకులు, బీజేపీ పార్టీ అధ్యక్షులు బాబు, కాళంగి రిజర్వాయర్ చైర్మన్ రాజారెడ్డి, పూడీ సీకే పురం లోకనాయుడు, వాసు నాయుడు, లోకనాథం నాయుడు, అవసరం సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగోటి రజిత, గోవర్ధన్, సురుటుపల్లి దేవస్థానం డైరెక్టర్ కరప్పారెడ్డి, కవిత, చెంచయ్య, వెంకటకృష్ణయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రసాద్, ఎస్సీ సెల్ మునికృష్ణ, కరపారెడ్డి, బాలు, బోడిరెడ్డి కండ్రిగ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

**విజయపురం, అక్టోబరు 29 ప్రభాతవార్త:**

గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తేనే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని భూచివానత్తం గ్రామ సర్పంచ్ గోపాల్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం వీధుల్లో చెత్తాచదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గత రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వీధుల్లో అక్కడక్కడ వర్షంనీటిని నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీధులను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్టు సర్పంచ్ తెలిపారు.

## ఎమ్మెల్యే కృషికి అభినందనలు

**విజయపురం, అక్టోబరు 29 ప్రభాతవార్త:**

తిరుపతి జిల్లాలో నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో నియోజకవర్గంలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాలను కలపాలని కృషి చేసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఈ ప్రాంత ప్రజలు అభినందనలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరి నియోజకవర్గాన్ని రెండుగా చీల్చి పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలోను, మిగిలిన నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు చిత్తూరుకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక పలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఎన్నికల అప్పుడు ఈ మండలాలు ప్రజలు విన్నపాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌కు విన్నవించడంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపడం జరిగిందన్నారు.

## విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు టైలరింగ్ మిషన్లు పంపిణీ

**సత్యవేడు, అక్టోబరు 29 ప్రభాతవార్త:**



ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు ఉచితంగా టైలరింగ్ మిషన్లను పంపిణీ చేశారు. బుధవారం సత్యవేడు తంత తపాలా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన తపాలా శాఖ అధికారి మనోహర్ విశ్వకర్మ యోజన లబ్ధిదారులు జాఫర్ హుస్సేన్‌కి టైలరింగ్ మిషన్ సంబంధించిన విడి భాగాలు, వస్తు సామగ్రిని అందించారు. స్వయం ఉపాధి అవకాశాలను పెంచాలన్న ఉద్దేశంతో ప్రధాన మంత్రి విశ్మకర్మ యోజన పథకంలో నాలుగు నెలల క్రితం స్థానిక దాసు డిగ్రీ కళాశాలలో సంబంధిత ఏజెన్సీ టైలరింగ్ లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో శిక్షణ తీసుకున్న లబ్ధిదారులకు శిక్షణ కాలంలో 3 వేలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోకి కేంద్రప్రభుత్వం జమ చేసింది. ఈ నేపథ్యంలో శిక్షణ తీసుకున్న లబ్ధిదారులందరికి ప్రస్తుతం ఉచితంగా టైలరింగ్ మిషన్లను అందించింది. ఇందులో భాగంగా 15 వేలు విలువ చేసే టైలరింగ్ మిషన్, మోటారు, ఐరన్ బాక్సు, టేబుల్, నూలు పంపిణీ చేశారు.



## యువకుడు ఆత్మహత్య

**రేణిగుంట, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబిఐడి కాలనీలో అబ్బాస్ (23) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా...అబ్బాస్ తండ్రి దుబాయిలో బతుకుదెరువు కోసం వెళ్ళాడు. ఇంట్లో తల్లి కుమారుడు మాత్రమే ఉంటున్నారు. అబ్బాస్ పూర్తిగా మద్యానికి బానిసై తల్లితో తరచూ గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అమ్మతో గొడవపడ్డాడు. తల్లి ఇతని బాధ భరించలేక గుత్తి వారి పల్లి లోని బంధువుల ఇంటికి వెళ్ళింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురై ఇంట్లో దుప్పటితో సీలింగ్ ఫ్యాన్ కు రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం స్థానికులకు పొక్కడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జలాది వాసం నుంచి ధాన్యది వాసానికి అత్తి వరదరాజస్వామి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయం జీర్ణోద్ధారణకు సుమారు ఐదేళ్ల ముందు ఉన్న ఆలయాన్ని భిన్నం చేసారు. కొత్త ఆలయ నిర్మాణానికి బాలాలయం చేసారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా ఆలయ నిర్మాణం పూర్తి కాకపోవటంతో బాలాలయ కాలం ముగియటంతో అతి చెక్కతో తయారు చేసిన ప్రసన్న వరదరాజస్వామి విగ్రహాన్ని తయారు చేయించారు. ఈ విగ్రహాన్ని కొంత కాలం జలాధివాసంలో ఉంచారు. బుధవారం జలాధి వాసం నుంచి ధాన్యాది వాసానికి మార్చారు.ఈ సందర్భంగా ప్రసన్నవరదరాజస్వామి ఆలయం ఆవరణలో భారీ ఎత్తున ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసారు. ఆలయ పూజారి శ్రీనివాసాచారి శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ వారి సహచరులు స్వాగతం చెప్పారు. ఆలయం తరపున డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్యయ్య,ఆలయ పూజజారి శ్రీనివాసాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ఎంఎల్ఏతో పాటుసభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి,గోపినాధ్, లక్ష్మమ్మ, చాగణం శైలజ,కాసరంరమేష్, కృష్ణంనాయుడు తదితరులు హాజరయ్యారు. భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.

## శివయ్య సన్నిధిలో పూజలు జరుపుకున్న కార్యదర్శి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరి జవహర్‌లాల్ కుటుంబసభ్యులతో కలసి పూజలు, అభిషేకాలు జరిపించుకున్నారు. ఆయన మంగళవారం రాత్రి ఇక్కడకు వచ్చి బస చేసారు.ఆలయంలో వేకువజామున గోపూజలతో ప్రారంభించి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. స్వామి అమ్మవార్లకు నిర్వహించే అభిషేకంలో పాల్గొన్నారు.వారికి ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి, చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌లు సాదరంగా ఆహ్వానించారు. స్వామి అమ్మవార్ల అభిషేక సేవలో పాల్గొన్న వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషనంయాదవ్, ఎపిఆర్ఓ రవి,ఆలయ ఇన్స్ పెక్టర్ సుదర్శనం నాయుడులు పర్యవేక్షించారు.

## తుఫానుతో తల్లడిల్లుతున్నారు: ఆదరించి ఆదుకోండి

మాజీ ఎంఎల్ఏ విస్తృత పర్యటన



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు గతంలో పది రోజులుగా కురిసిన వర్షాలతోనూ, రెండు రోజులు కురిసిన మొంథా తుఫానుతో గ్రామాల్లో తీవ్ర నష్టాలు వాటిల్లాయి. బుధవారం పలు గ్రామాల్లో పర్యటించినట్లు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తెలిపారు. ఇక్కడ మీడియాతో మాట్లాడు తూ తాను అబ్బాబట్ల పల్లి,అరుంధతి వాడ, ముళ్ళపూడి గిరిజన కాలనీ, పోలి గిరిజన కాలనీల్లో తాను పర్యటించి పరిస్థితిని పరిశీలించామని మధుసూధనరెడ్డి వివరించారు.ఈ సందర్భంగా ఆయన దెబ్బతిన్న ఇళ్ళను పరిశీలించానని నిరుపేదలైన బాధితులకు తన వంత సహాయంగా దుప్పట్లు అందించినట్లు తెలిపారు.మొంథా తుఫాను కారణంగా గిరిజన కాలనీల్లో గుడిసెలు కూలటం కాకుండా ముందస్తు వేసిన పంటలు పొగొట్టుకున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు.గ్రామాల్లో కలుషిత నీరు తాగటం వల్ల ప్రజలకు అనారోగ్యం చేసే ప్రమాదం ఉందని ప్రతి గ్రామ పంచాయతీ మంచినీటిలో బ్లీచింగ్‌తో పాటు క్లోరినేషన్ చేయాలని ఆయన కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వరద కాలువలు అడ్డంకిగా ఉన్నాయన్నారు. ఈదుల గుంట, సున్నపు కాలువ, మోదుగుల పాళెం వద్ద స్వర్ణముఖి నదులకు హైలెవల్ వంతెనలు నిర్మించి రాకపోకలకు అంతరాయం కల్గ కుండా చూడాలని మాజీ శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి కోరారు. ముందుజాగ్రత్త చర్యగా ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.నియోజకవర్గంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా కావటం లేదని ఆ శాఖ స్పందించి పునరుద్దరించాలన్నారు.ఈ సమావేశంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బ్రహ్మభూషణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూధనంరెడ్డి, రైతు విభాగం నాయకుడు వయ్యాల మనోహర్‌రెడ్డి, వాలంటీర్ విభాగం అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు, రామాపురం సర్పంచ్ బాలిరెడ్డి,ఇనగలూరు సర్పంచ్ వేంపల్లి సురేంద్రయాదవ్,రామలింగాపురం సర్పంచ్ బక్త కంఠారెడ్డి, మంగళపురి సర్పంచ్ రవిశేఖర్‌రబాబు, శ్రీకాలహస్తి నియోజకవర్గ మైనారిటి అధ్యక్షుడు పఠాన్ ఫరీద్‌ఖాన్,వైస్ ఎంపిపి భాను మూర్తియాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## చల్లపాళెం నిరాశ్రయులను ఆదుకోండి: సిపిఐ

**శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 29 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలం చల్లపాళెంలోని మొంథా తుఫానుతో నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య బుధవారం డిమాండ్ చేసారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సిపిఐ నాయకులు గ్రామాల్లో పర్యటించారు. బుధవారం చల్లపాళెంలో పరిస్థితిని సమీక్షించారు.ఈ గ్రామంలో నిరుపేదల ఇళ్ళ గోడలు బాగా దెబ్బతిన్నాయని బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.50వేలు పరిహారం చెల్లించాలని కోరారు.పనుల్లేక పస్తులు గడుపుతున్న పేద కుటుంబాలకు నెలకు సరిపడ్డ నిత్యావసర సరకులుఅందించాలని ఆయన కోరారు.నియోజకవర్గంలోని దళిత, గిరిజన కాలనీల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉందని వివరించారు.దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి జనజీవనాన్ని క్రమబద్దికరించాలని డిమాండ్‌చేసారు. ఆయనతో పాటు కుడిచేడు చంద్రబాబు,,కాశీమాల మోహన్,సైదాపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులను ఇబ్బంది పెడితే సహించేది లేదు.

పుణ్యక్షేత్రంలో బిక్షగాళ్ళ బెడద ఉండరాదు



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతార్త** శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయ పరిస రాల్లో బిక్షగాళ్ళ బెడదకు సంబంధించి కొందరు వన్‌టౌ న్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ నేపధ్యంలో బుధవారం పోలీసు స్టేషన్ ఆవరణలో ఆలయ పరిసరాల్లోని బిక్షగాళ్ళను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి వారికి అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తిలోని కొందరు బిక్షగాళ్లు బిక్షం ఎత్తుకుంటూ నిత్యం మత్తులో మునిగి తేలుతున్నారు.సిఐ ప్రకాష్‌కుమార్, ఎస్ఐ రవి,మహిళ ట్రైనింగ్ ఎస్ఐలు బుధవారం ఆలయం చుట్టుపక్కల ఉన్న బిక్షగాళ్లను పోలీసు స్టేషన్ ఆవరణలోకి తీసుకొని వచ్చి మీరందరూ పట్టణానికి బయట వెళ్ళాలని సూచించారు.నిత్యం ఇక్కడకువచ్చేభక్తులను ఇబ్బంది పెడుతూ ఆలయ ప్రతిష్టను దిగజార్చితే సహించేది లేదని స్పష్టం చేసారు.

## మొంథాన్ మిగిల్చిన గతుకులు: అతుకులెప్పుడో?

**తొట్టంబేడు,అక్టోబర్ 29 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండల పరిధిలోని పలు గ్రామాలకు సంబంధించిన రోడ్లు మొంథాన్ తుఫాన్ పుణ్యమా అని గతుకులు మిగిల్చాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తి- పిచ్చాటూరు రోడ్డులోని బంగారమ్మ కాలనీ వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. బుధవారం రోడ్ల పరిస్థితిని గమనిస్తే ఈ గతుకుల రోడ్లు ఏ నాగరికతకు నిదర్శనం అని చర్చించుకుంటున్నారు. మొంథాన్ తుఫానుకు శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డు, కాసరం, కనపర్తి రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.ఈ రోడ్లు అన్ని ఆర్అండ్‌బి శాఖకు చెందిందన్నారు.ఎహైవే రోడ్లు చక్కగా ఉండగా సర్వీస్ రోడ్లు ధ్వంసమయ్యాయి.శ్రీకాళహస్తి పిచ్చాటూరు మార్గంలో రోడ్లు ధ్వంసం కావటంతో ఈమార్గంలో ద్విచక్ర వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గుతుంది.ఓ వైపు ఆటోల వేగంతో ఇతర వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ మార్గంలో రోజూ వేలాది వాహనాలు పరుగులు తీస్తుంటాయి.ఇక్కడ ఆర్అండ్‌బి శాఖ స్పందించి వెంటనే కనీసం తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.ఇక మండలంలోని కొత్త కండ్రిగ కు వెళ్ళు మార్గంలోని కాసాతోట సర్కిల్‌లో రోడ్డు ఉందా? లేదా అనే సందేహం కల్గుతుంది.ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్‌బి అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు

## రెడ్ క్రాస్ కొత్త కార్యవర్గం

**తొట్టంబేడు,అక్టోబర్ 29 ప్రభాతవార్త**



రెడ్ క్రాస్ సొసైటి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. ఈ ప్రతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ ద్వారా అందుకున్నట్లు వైస్ చైర్మెన్ గుడ్లూరు మమూర్ బుధవారం మీడియాకు తెలిపారు.తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం అధ్యక్షులుగా దగ్గుబాటి శ్రీహరి రావు,వైస్ చైర్మెన్‌గా గుడ్లూరు మయూర్‌లను ఎన్నుకున్నారు. భవి ష్యత్ కార్యక్రమాలను కలెక్టర్‌కు కార్యవర్గ వివరించారు.రెడ్ క్రాస్ సొసైటి సారథ్యంలో సామాజిక కార్యక్ర మాలను చేపట్టనున్నట్లు గుడ్లూరు మయూర్ వివరించారు.ఇటీవల భారీ ఎత్తున రక్త దాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. రాబోవు రోజుల్లో నిరుపేదలకు సంబంధించి ఉచిత సేవా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వివరించారు.రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ఎంజిఎం ఆసుపత్రి సారథ్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## ఉపాధ్యాయులను టెట్ రాయమనటం బాధాకరం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త**




రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి ద్వారా ఎంపికైన ఉపాధ్యా యులకు టెట్ రా యాలనటం బాధాకరమని బుధవారం జరిగిన ఎపిటిఎఫ్ జిల్లా సమావేశంలో అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి టీచర్స్ ఫెడరేషన్ సమావేశం బుధవారం తిరుపతి జిల్లా అధ్యక్షుడు బి.మురళీ కృష్ణ సారథ్యంలో సమావేశం జరిగింది.2025 డిఎస్‌సిలో నియమితులైన 22 మంది ఉపాధ్యాయులను ఎపిటిఎఫ్ సేవా పుస్తకాలను అందించారు.బాధ్యతలు స్వీకరించిన నూతన యువ ఉపాధ్యాయులకు అభినందించారు. శ్రీకాళహస్తి శాఖ అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నూతన వరవడికి కొత్త ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఓ వైపు బాధ్యతలను నిర్వర్తిస్తూ తమ హక్కులకై రాజీ లేని పోరాటం సాగించాలని సూచించారు.రాష్ట్ర అడిట్ కమిటి సభ్యులు కే.వెంకటాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం 2001 సెప్టెంబర్ నుంచి 2010 వరకు నియమించబడిన ఉపాధ్యాయులు టెట్‌పరీక్షలను నిర్భంధంగా రాయాలనటం ప్రభుత్వ ఏక పక్ష నిర్ణయానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం సుప్రీం కోర్టుకు అఫిడియేట్ దాఖలు చేసి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా చేయాలని డిమాండ్‌చేసారు. రాష్ట్ర అడిట్ కమిటి మాజీ కన్వీనర్ . జి.సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా ఎపిటిఎఫ్ వెంట ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు హేమకుమార్, పడిచంద్రశేఖర్, సూర్యంశ్రీనివాసులు, నజీర్‌ఖాన్, హరినాధ్, మస్తాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కదులుతున్న రైలు నుండి పడి యువకుడికి తీవ్ర గాయాలు

**రేణిగుంట అక్టోబర్ 29 ప్రభాతవార్త**

రేణిగుంట రైల్వే స్టేషన్ నందు లైసెన్సుడ్ వెండరుగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్ కి చెందిన ప్రదీప్ ప్రమాదవశాత్తు రైలు కింద పడడంతో కాలు పూర్తిగా శరీరం నుండి వేరైనా సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వృత్తి ధర్మంలో భాగంగా రైల్లో ప్రయాణికులకు తినుబండారాలు అమ్మడానికి రైలు ఎక్కాడు. రైలు కదులుతుండగా దిగబోయి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు రైలు చక్రాలు అతని కాలుపై ఎక్కి కాలు శరీరం నుండి విడిపోయింది. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతనిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం రైల్వే పోలీసులు తరలించారు.

# తిరుపతి డివిజన్

## ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

**నారాయణవనం(వరదయ్యపాలెం), అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



రెండు రోజుల క్రితం తెలుగుగంగ కాలువలో పడి మృతి చెందిన బాధిత రెండు కుటుంబాలను కూటమి ప్రభుత్వం తరపున తప్పక ఆదుకుంటామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే మృతి చెందిన కారు డ్రైవర్ షరీఫ్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడం పట్ల విచారం వ్యక్త పరిచారు. కుటుంబానికి అండగా వుంటామని, 10వేల రూపాయాల ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం వరదయ్యపాలెం మండలం రాచర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కిషోర్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ని ఎమ్మెల్యే ఇంటికెళ్లి పరామర్శించి 10వేలు ఆర్థికసాయం అందించారు.

## దోమకాటుకి గురి కాకుండా జాగ్రత్తగా వుండాలి

డాక్టర్ దర్శిత్‌రాజ్



***నారాయణవనం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :*** ప్రజలు ఈ సీజన్‌లో దోమకాటుకి గురికాకుండా జాగ్రత్తగా వుండాలని స్థాని పిహెచ్‌సి డాక్టర్ దర్శిత్‌రాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని తుంబూరు పంచాయతీ వెలుతురుకుండ్రిగలో తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మురికికాలువలను శుభ్రం చేయడంతో పాటు నీటి నిల్వ వుండ కుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఇళ్ల వద్దకు వెళ్లి ఫీవర్ సర్వే కూడా చేయాలన్నారు. టైర్లు, కోడిగుడ్డు బొప్పిలు, చిప్పలు, కుండలు, రోళ్లో ఎక్కడ నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం తీవ్రంగా వుంటే ఆస్పత్రిలో డాక్టర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ జ్వరాలపై జాగ్రత్తగా ఉండాలి

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 29 ప్రభాతవార్త:**



వర్షాలు తరచూ పడడం, మొంథా తుఫాను ప్రభావంతో ఇంటి పరిసర ప్రాంతాలు వీధుల్లో నీటి నిల్వ తొలగించి పరిసరాలు పరిశుభ్రంగాఉంచుకుని సీజనల్ వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య అధికారి డి.ఎన్.వెంకటేశ్వరులు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం యానాది కాలనీలో బుధవారం ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం జరిగింది. తాగునీటిని వేడి చేసి చల్లార్చి తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే పాటించడం ద్వారా అంటే ఇంటిలోని నిల్వ నీటిని ప్రతి శుక్రవారం ఖాళీ చేసి మరలా పట్టుకోవడం ద్వారా దోమల అభివృద్ధిని, టైఫాయిడ్, అతి సారా తదితర జబ్బుల బారిన పడకుండా నివారణ చర్యలు జాగ్రత్తలు సూచనలు అందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

**విజయపురం, అక్టోబరు 29 ప్రభాతవార్త:**

గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తేనే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని భూచివానత్తం గ్రామ సర్పంచ్ గోపాల్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం వీధుల్లో చెత్తాచదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గత రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వీధుల్లో అక్కడక్కడ వర్షంనీటిని నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీధులను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్టు సర్పంచ్ తెలిపారు.

## ఎమ్మెల్యే కృషికి అభినందనలు

**విజయపురం, అక్టోబరు 29 ప్రభాతవార్త:**

తిరుపతి జిల్లాలో నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో నియోజకవర్గంలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాలను కలపాలని కృషి చేసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఈ ప్రాంత ప్రజలు అభినందనలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరి నియోజకవర్గాన్ని రెండుగా చీల్చి పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలోను, మిగిలిన నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు చిత్తూరుకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక పలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఎన్నికల అప్పుడు ఈ మండలాలు ప్రజలు విన్నపాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌కు విన్నవించడంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపడం జరిగిందన్నారు.

## వీరంగారి సురేష్ రెడ్డి భౌతిక కాయానికి ఎంఎల్ఏ పులివర్తి నివాళి



**చంద్రగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** చంద్రగిరి టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటిసి వీరం గారి రమేష్ రెడ్డికి స్వయాన సోదరుడు వీరంగారి సురేష్ రెడ్డి అలియాస్ గోపి స్వామి భౌతిక కాయానికి బుధవారం ఎంఎల్ఏ పులివర్తి నాని నివాళులర్పించారు. గోపి స్వామి అనారోగ్యం మృతి చెందినట్లు సమాచారం అందుకున్న ఎంఎల్ఏ పాతపేటలోని వారి నివాసానికి చేరుకున్నారు. ఈ క్రమంలో వీరం గారి కుటుంబ సభ్యులను ఎంఎల్ఏ పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను రమేష్ రెడ్డి ఎంఎల్ఏకి వివరించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యాభ్యాసం ఉజ్వల భవిష్యత్తుకు పునాది : సిఐ



**చంద్రగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** విద్యార్థి దశలో క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయడం ఉజ్వల భవిష్యత్‌కు పునాధి కాగలదని చంద్రగిరి సిఐ సురేష్‌కుమార్ అన్నారు. అగరాల సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (గరుడాద్రి భవన్ క్యాంపస్) లో బుధవారం ఆయన విద్యార్థులకు ప్రస్తుత సామాజిక స్థితిగతులపై అవగాహన కల్పించారు. ఎదుగుతున్న వయస్సులో ప్రక్కదారులు పట్టి మత్తుకు అలవాటుపడితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. సహచర విద్యార్థులతో స్నేహం, సైబర్ నేరాలు, గంజాయి, మద్యం, సోషల్ మీడియా, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు, కోర్డీన్ ఏఎస్ఆర్, డీన్ వేణుగోపాల్ రావు, ప్రిన్సిపాల్ బి.వి.ఆంజనేయులు, ఏజిఎం కార్తీక్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముంపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..!

చంద్రగిరి వైసిపి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త:**

రాయలచెరువులో పంటలు ముంపుకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చంద్రగిరి వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. బుధవారం నాయకులతో కలసి ఆయన రాయల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాయలచెరువులో 60 శాతం నీరుమాత్రమే వున్నట్లు తెలిపారు. రాయలచెరువు పరివాహక ప్రాంతంలో రైతులు తమ పొలాలలో ఏళ్ళ తరబడి నీరు నిల్వ వుండటంతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. గతంలో రాయలచెరువు కట్ట ప్రమాదకర స్థితిలో వున్నప్పుడు మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వారం రోజులు కట్టపైనే బసచేసి కట్ట మరమత్తు పనులు చేయించినట్లు గుర్తు చేశారు. వరదల్లో చిక్కుకున్న చిట్టత్తూరు, కాలేపల్లి గ్రామస్థులకు హెలికాప్టర్ ద్వారా నిత్యవసర వస్తువులు అందజేసి ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొంత మంది రైతులు పశుగ్రాసం సైతం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెజి బియ్యం సైతం బాధితులకు పంపిణీ చేయకుండా ఎంఎల్ఏ పులివర్తి నాని తూతూ మంత్రంగా కార్లలో తిరిగి వెళ్ళిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహానందరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు వల్లేటి భానుకుమార్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, గురుస్వామిరెడ్డి, బీకిరెడ్డి, లావణ్య చంద్రబాబు, నిరంజన్‌రెడ్డి, హిమాల్ రెడ్డి, గోపి చౌదరి, చిరంజీవి నాయుడు, యశ్వంత్ రెడ్డి, సిద్దారెడ్డి, ఇరగం రెడ్డి, మారయ్య, భాస్కర్ రెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు.

## కార్తీక సోమవారాల్లో ఆలయ దర్శనం బస్సులు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 29 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం నుంచి కార్తీక సోమవారం సందర్భంగా పలు పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక బస్సులను నడుపుటకు నిర్ణయించినట్లు డిపో మేనేజర్ రేవతి బుధవారం తెలిపారు. నవంబర్ 3,10,17 తేదుల్లో సోమవారం 5గంటలకు శ్రీకాళహస్తి బస్టాండు నుంచి ఎక్స్‌ప్రెస్ బయలు దేరుతుందని మేనేజర్ వివరించారు. శ్రీకాళహస్తి నుంచి గుడిమల్లం, అప్పలాయగుంట, వకుళ మాత ఆలయం,ముక్కోటి, తలకోనకు వెళ్ళి తిరిగి సాయంత్రం 5గంటలకు శ్రీకాళహస్తికి చేర్చుతుందని ఆమె వివరించారు. ఒకే రోజు ఐదు ప్రసిద్ది చెందిన శైవ క్షేత్రాల దర్శనం ప్రత్యేకం అని వివరించారు. చార్జీలు రూ.450లు ఖరారు చేసినట్లు తెలిపారు.ఐదు దేవాలయాల్లో దర్శంచటమే కాకుండా దీపారాధన చేసుకునే అవకాశం కల్పించబడిందనితెలిపారు. ప్రతి పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తి నుంచి తమిళనాడులోని తిరుణ్ణామలైకు అల్ట్రాడీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రేవతి వివరించారు. వెళ్ళటానికి మాత్రమే రూ.420లుఅని తెలిపారు. ఆన్‌లైన్లో బుక్ చేసుకోవచ్చునని తెలిపారు.అలాగే శ్రీకాళహస్తి బస్టాండులో కూడా కౌంటర్‌లోల రిజర్వేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు.మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ రేవతి తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో స్వచ్ఛోత్సవ్ నిర్వహణ



గూడూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: మహిళలు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో నాయకత్వ పాత్ర పోషించాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూ నికేషన్ ప్రతినిధి పి.హరికృష్ణ పిలుపునిచ్చారు. దువ్వూరు రమణమ్మ మహిళా డిగ్రీ కళాశాల, సీబీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛోత్సవ్-2025 కార్యక్రమంలో ఆయన కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. పి హరికృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా 2.0 కార్యక్రమంలో మహిళలు ప్రముఖపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఇందువల్ల శానిటేషన్ కార్యక్రమాలు మరింత ఫల ప్రదంగా సాగడమే కాకుండా, సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో, ఘన వ్యర్థాల ఆర్థిక వ్యవస్థలో మహిళలకు అవకాశాలు లభించడంలో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. దువ్వూరు రమణమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఈపి హనుమంతరావు మాట్లాడుతూ క్యాంపస్‌లో స్వచ్ఛత ప్రమాణాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. గూడూరు సిడిపిఓ ఎస్ కె.మహబూబీ మాట్లాడుతూ అందరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉన్న రోజు కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని అప్పుడే ఆరోగ్యవంతమైన వికసిత్ భారతదేశం వైపు అడుగులు వేయచ్చని తెలియజేశారు. రోటరీ జోనల్ ఎన్విరాన్మెంటల్ కో ఆర్డినేటర్ బివి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థినులు అందరూ ప్లాస్టిక్ వాడకాని తగ్గించి స్వచ్ఛతలో భాగం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.పి.గాయత్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంతి, విద్యార్థినులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్



## రొచ్చుగుంటగా మారిన రోడ్లు

సూళ్లూరుపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త: అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు గత వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రొచ్చుగుంటలుగా మారాయి. పట్టణంలోని మున్సిపాలిటీ రోడ్లుతో సహ జీఎన్‌టి రోడ్డు గుంటలమయంగా మారిపోయింది. గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొరిడి, పేర్నాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు నడవాలంటే కూడా నరకాన్ని తలపించే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ముందే తీరప్రాంత గ్రామాలు కావడంతో ఇక్కడి ప్రజల బాధలు వర్ణనాతీతం. అలాగే సూళ్లూరుపేట నుంచి కోటకు వెళ్లే మార్గంలో గల కోటపోలూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. నేతలు స్పందించి త్వరితగతిన మరమ్మతులు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పాఠశాల తనిఖీ చేసిన ఎంఇఓ

కోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కోటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఓ మస్తానయ్య తనిఖీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం రహంతుల్లా ఉన్నారు.

## తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : నేదురుమల్లి



వాకాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ మాజీ చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వాకాడులో ఆయన నివాసంలో మండల వైకాపా నాయకులు రామ్‌కుమార్ రెడ్డితో భేటీ అయ్యారు. తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన సంఘటనలన్నీ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులను వెంటనే ఆదుకోవాలని తెలియజేశారు. అధికారులు బ్యారేజ్, పొర్లు కట్టలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మా అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు అందుబాటులో ఉండాలని తెలిపారు అన్నారు. వాకాడు దేవుడు మాన్యం భూములలో అధికారులు వేలంలో చట్టపరంగా పాటించలేదని సంబంధించిన అధికారులు నిబంధన విరుద్ధంగా నడుచుకున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యనిర్వాహన సభ్యులు భక్తవత్సలరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఏఎంసి డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, నెల్లూరు పెంచల్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, వాకాటి రవికుమార్, నాగూర్‌రెడ్డి, శ్రీనివాసులు గౌడ్, తదితరులు ఉన్నారు.

## పెచ్చులు ఊడిపడుతున్న తహసీల్దార్ కార్యాలయం



బాలాయపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: శిథిలావస్థకు చేరుకొన్న బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనం మొంథా తుఫాను దాటికి మరింత బలహీనపడింది. వర్షాలు పడి చాలా గదులలో శ్లాబ్ పెళ్లలు పెచ్చులూడి పడిపోయాయి. ఎప్పుడు కూలిపోతుందో అర్థం కాని పరిస్థితుల్లో కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు. చాలా గదుల్లో వర్షపునీరు చుక్కలుగా పడుతున్నాయి. దీంతో విధులకు అంతరాయం కలుగుతోంది. వర్షపు నీటి చుక్కలు పడుతుండంతో కొన్ని గదుల్లోని రికార్డులు, కంప్యూటర్లు దెబ్బతినే అవకాశం ఉంది. తహసీల్దార్ కార్యాలయం ఎప్పుడు కూలిపోతుందో అర్థం కాని పరిస్థితుల్లో కార్యాలయ అధికారులు, సిబ్బంది భయాందోళనలో విధులు నిర్వహిస్తున్నారు. మొంథా తుఫాను దాటికి భవనం మొత్తం శిథిలావస్థకు చేరుకొంది. వర్షాలకు భవనం ఉరిసి అక్కడక్కడ నీరు చుక్కలుగా పడుతున్నాయి. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, కంప్యూటర్ గదులలో వర్షపు జల్లులు తరచుగా తమ కూర్చునే సీట్లు, బల్లలపై పడుతుండడంతో, అవస్థలు పడుతూ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. విద్యుత్ పరికరాలు, కంప్యూటర్లు, వీడియో కాన్ఫెరెన్స్ పరికరాలు మరమ్మత్తులకు గురి అవడంతో పాటు, షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలిపారు. నూతన భవనం కోసం ఇప్పటికే రెండు సార్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని తహసీల్దార్ తెలిపారు. మరల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని ఆమె తెలిపారు.

## నెల్లూరు జిల్లాలో...గూడూరు

## - నెరవేరనున్న నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక

కోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త: రాష్ట్రంలో కొత్త జిల్లాల్లో, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాటు పేర్లు మార్పులపై కసరత్తు కొలిక్కి వచ్చింది. ఆ మేరకు మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సీఎం చంద్రబాబునాయుడుతో భేటీ అయింది. నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. వైసీపీ హయాంలో ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా ఏకపక్షంగా జిల్లాలను విభజించారు. అప్పటి అనాలోచిత నిర్ణయాలతో గూడూరు నియోజకవర్గ ప్రజలు మూడేళ్లు ఎంతో ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చే పరిపాలన సౌలభ్యం ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి పేర్కొనడంపై నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైసీపీ పాలనలో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో కలపడంతో ఇక్కడి ప్రజలు తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు గూడూరు పర్యటన సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అదే క్రమంలో యువగళం పేరుతో కోటకు వచ్చిన నారా లోకేష్ కూడా కోటలో జరిగే సభలో గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాలు, గతంలో ఇబ్బందులు పడిన నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధుల నుంచి అర్జీలు స్వీకరించింది. ఆ మేరకు త్వరలోనే గూడూరు నియోజకవర్గం నెల్లూరు జిల్లాలో విలీనం కానున్నట్లు సాక్షాత్తు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రకటించారు. దీంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మంచినీటి పథకాల పరిశీలన

కోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త: మొంథా తుపాను ప్రభావంతో గత ఐదురోజులుగా కోట మండలంలో వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో వాటర్ ట్యాంకుల్లో భూగర్భ జలాలు కలిసి కలుషితమయ్యే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం గూడలి వద్ద స్వర్ణముఖి నది, వాకాడు వద్ద స్వర్ణముఖి నది వద్ద మంచినీటి పథకాలను ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు పరిశీలించారు. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని సూచించారు. ప్రజలు కూడా మరో వారంరోజులు పాటు మంచినీటి కాచి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు.

## ఎంఎస్ఎంఈసీ చైర్మన్ కలిసిన కృష్ణయ్య

వెంకటగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎంఎస్ ఈసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ని మంగళగిరిలోనే ఆయన ఆఫీసు నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జనసేన పార్టీ వెంకటగిరి నియోజకవర్గ పరిస్థితి, జనసేన రాష్ట్ర కార్యదర్శి జిల్లా పరిస్థితుల గురించి వివరించారు. త్వరలోనే జిల్లాకి వచ్చి నేరుగా అందరి అభిప్రాయము తీసుకుంటారని తెలిపారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



వెంకటగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటి నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటి, రెండు తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎస్ఎల్‌సి కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. మొదటి టర్మ్ విద్యార్థులు నేర్చుకున్న తల్లిదండ్రుల ముందు ఉపాధ్యాయులు చెప్పించారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగురు రమాదేవి పర్యవేక్షణ బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రియాజ్, ఈ ఛాన్స్ కోఆర్డినేటర్ ప్రిస్కల, వైస్ ప్రిన్సిపాల్ సోహిని, ఏవో మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలపై పడిన చెట్టు...ఆగిన కరెంట్ సరఫరా

వెంకటగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : మండలంలోని సిసి కండ్రిగ గ్రామంలో తుఫాను కారణంగా చెట్టు విరిగి కరెంటు స్తంభం పై పడటంతో స్తంభాలతో పాటు కరెంటు వైర్లు నేల కూలాయి. కరెంట్ సరఫరాకు గ్రామంలో అంతరాయం కలిగింది. పెనుగాలులు వర్షానికి చెట్టు నేలకొరిందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ వైర్లు స్తంభాలు పడిపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. అధికారులు చర్య చేసుకొని వెంటనే స్తంభాల పునరుద్ధరించాలని కోరారు.

## ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసిన కూటమి నేతలు



వెంకటగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచనల మేరకు తుపాను సహాయక చర్యలు చేపడుతున్నట్లు మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు తెలిపారు. వెంకటగిరి పట్టణం 13వ వార్డు చింత చెట్టు కింద నివాసం ఉంటున్న వారికి కూటమి ప్రభుత్వ నాయకులు ఆహార ప్యాకెట్లను గిరిజనులకు అందజేశారు. వెంకటగిరి ప్రాంతాల్లో తుఫాను ప్రభావం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు వెంకట ముని, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

సూళ్లూరుపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లయ్య అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. హోలీక్రాస్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో ప్రమాదం జరిగిన స్థలానికి సమీపంలో ఉన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తన నివాసం నుంచి వెలుపలికి వచ్చి తీవ్రంగా గాయపడిన పుల్లయ్యను ప్రభుత్వానికి తరలించే ఏర్పాట్లు చేశారు. పుల్లయ్య ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు ఈ ఆగంతకులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## తుఫాన్ దెబ్బకు రోడ్లు గుంతలమయం

గూడూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: పట్టణంలో గత రాత్రి తుఫాన్ తీరం దాటడంతో వర్షాలు పూర్తిగా తగ్గు ముఖం పట్టాయి. దీంతో ప్రజలు వారి పనులలో నిమగ్నమయ్యారు. వర్షాలతో గూడూరు నియోజకవర్గంలో పలు ప్రాంతాల రోడ్లు గుంతల మయంగా తయారయ్యాయి. అలాగే పంబలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు రాకపోకలను నిలిపివేశారు. తుఫాన్ ప్రభావం డివిజన్‌లో పెద్దగా లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## నవంబర్ 1న చలో హైదరాబాద్ ర్యాలీ

గూడూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి పైన అడ్వకేట్ రాకేష్ కిషోర్ కాలి బూటు వేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 1న చలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో నంద ఎమ్మార్పీఎస్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ తిరుపతి జిల్లా ఇంచార్జ్ వర్ల దేవదాస్ మాదిగ నియోజకవర్గ ఇన్చార్జ్ గొల్లపల్లి సిసింద్రీ మాదిగ పాల్గొన్నారు. మాదిగ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, చిల్లకూరు మండల ఇంచార్జ్ మల్లికార్జున, గూడూరు పట్టణ అధ్యక్షులు సాయినాథ్, మండల నాయకులు కిరణ్, పెంచలయ్య, గురవయ్య, జ్యోతిలు పాల్గొన్నారు.

## గిరిజనులకు భోజన వసతి ఏర్పాట్లు



చిల్లకూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇబ్బందులు పడుతున్న తమ్మినపట్నం గిరిజన కాలనీ వాసులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు కోదండరామస్వామి కళ్యాణ మండపంలో 3వ రోజు రెండు పూటలా మధ్యాహ్నం, రాత్రి వేళలో భోజనంతో పాటు వసతి ఏర్పాట్లను జిందాల్ వారి సౌజన్యంతో తెలుగుదేశం నాయకులు కోట సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో చేసారు. మత్స్యకారుల నాయకులు భక్తాని రామయ్య, తమ్మినపట్నం గ్రామాధ్యక్షుడు చిన్నబాబు, గ్రామ ఉపాధ్యక్షులు కొలంగారి సుబ్రహ్మణ్యం, గ్రామ పంచాయతీ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం తదితరులు దగ్గర ఉండి అన్ని చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా నాగబాబు జన్మదిన వేడుకలు

శ్రీసిటీ (తడ), అక్టోబర్ 29 ప్రభాతవార్త: జనసేన పార్టీ అగ్ర నాయకులు శాసన మండల సభ్యులు కొణిదెల నాగబాబు జన్మదిన వేడుకలు సూళ్లూరుపేట జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిట్కో చైర్మన్ వేముల అజయ్ బాబు సూచనల మేరకు తడ మండలం అనపగుంట గిరిజన కాలనీలో 56 కుటుంబాలకు దుప్పట్లు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు మాభాష, నక్క హరిబాబు, కోటి యాదవ్, ఆవుల దాస్, శంకు సురేష్, చేని సూరి, పద్మజ, సుజాత, మండల జనసేన సైనికులు సూర్య, మునీ, సాయి పాల్గొన్నారు.

## రైతులకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

శ్రీసిటీ (తడ), అక్టోబర్ 29 ప్రభాతవార్త: మొంథాఖితుఫాను ప్రభావంతో మండల పరిధిలో కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. పంట దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్ రైతులకు సూచించారు.

## తుఫానుకు పాడి గేదెల మృతి!

బాలాయపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : మొంథా తుఫాను వర్షాలు, ఎదురు చలి గాలుల దాటికి పాడి రైతు రవితేజకి చెందిన లేగదూడ మృతి చెందింది. లేగదూడ మృతదేహాన్ని విఆర్ఓ కృష్ణయ్య, పశువైద్య సిబ్బంది పరిశీలించారు. మొంథా తుఫాను వలన మండలంలో ఒక లేగదూడ మృతి, రెండు పూరిళ్లు దెబ్బతిన్నాయి. నివేదికను ఉన్నతాధికారులకు పంపి అర్హులకు నష్టపరిహారం అందిస్తామని తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు.

## రైతులకు యూరియా కార్డులు పంపిణీ



బాలాయపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: యూరియా పంపిణి కార్డుల కోసం బాలాయపల్లి సచివాలయానికి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. కార్డులు అయిపోతాయని రైతులు ఆందోళన చెందుతుండగా, యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని అందరికీ తగినంత యూరియాను పంపిణీ చేస్తామని బాలాయపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిణి విజయలక్ష్మి రైతులకు తెలిపారు. సచివాలయం రైతులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 100 యూరియా కార్డులు అందజేసినట్లు తెలిపారు. యూరియా కొరత వదంతి ఉండడంతో యూరియా పంపిణి కార్డుల కోసం బాలాయపల్లి సచివాలయానికి అధిక సంఖ్యలో రైతులు ఎగబడ్డారు. దింతో వ్యవసాయ శాఖ అధికారిణి విజయలక్ష్మి రైతులందరికి యూరియా పంపిణి కార్డులు ఇస్తామని తెలిపారు.

## తుపాకుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన



వెంకటగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: పోలీస్ అమరవీరుల వారోత్సవాలు భాగంగా విద్యార్థులకు వెపన్స్ వినియోగంపై బెటాలియన్ కమాండెంట్ సాయి ప్రసాద్ అవగాహన కల్పించారు. తుపాకులు ఎలా వినియోగించాలి, తుపాకుల్లో ఉన్న మోడల్స్‌ను తెలియజేశారు. విద్యార్థి దశ నుండే దేశభక్తి పెంపొందించుకోవాలని సూచించారు. పలు పాఠశాలల విద్యార్థులకు తుపాకుల వినియోగంపై వివరించారు.

## వరదని పరిశీలించిన ఎంపీడీవో



వాకాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: మండలం బాలిరెడ్డిపాలెం గంగనపాలెం స్వర్ణముఖి నది బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదని ఎంపీడీవో సాయిప్రసాద్ పరిశీలించారు. మొంతా తుఫాను కారణంగా మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు వలన స్వర్ణముఖి నది వరద తాకిడికి గంగన్నపాలెం, బాలిరెడ్డిపాలెం మధ్య ఉన్న స్వర్ణముఖి బ్రిడ్జ్ రాకపోకలు స్తంభించాయి. ఎంపీడీవో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని పునః పరిశీలించి ఎవరు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శి వారికి తెలియజేశారు. ఈ పరిశీలనలో డిప్యూటీ ఎంపీడీవో సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## నారాయణవనంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



నారాయణవనం, అక్టోబర్ 29 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్ వేంకటేశ్వర్లు బుధవారం సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం మండలంలో పర్యటించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్‌ని కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఆ మేరకు ముందుగా తుంబూరు కల్వర్టును పరిశీలించారు. ఈ కల్వర్టు నిర్మాణానికి ఇప్పటికే పలు దఫాలు ఎమ్మెల్యే ద్వారా వినతిపత్రాలు తమకు అందించడం జరిగిందని, తమరు కూడా కల్వర్టును పరిశీలించి ఏడాది గడస్తున్న ఇప్పటికి మరమ్మతు పనులు చేయడం లేదని గ్రామస్తులు, సర్పంచ్ కలెక్టర్‌కి తెలిపారు. అలాగే పాలమంగళం బ్రిడ్జి, తిరువట్యం కల్వర్టుల పరిస్థితి ఇలాగే వుందన్నారు. కావున తమరు స్పందించి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. అనంతరం తుంబూరు పంచాయతీ వెలుతురుకండ్రిగ గ్రామంలో ఎస్టీలు కాపురం వున్న సుమారు 20 పూరిళ్లు వర్షంతో నీట మునగడంతో వారికి పునరావాసం కల్పించడం జరిగిందని సర్పంచ్, కార్యదర్శి తెలిపారు. అనంతరం ఒక్కో కటుంబానికి 3వేల నగదు, బియ్యం, కూరగాయాలను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఆయనతో పాటు ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, పంచాయతీరాజ్ డిఇఇ మదుసూదన్, ఎంపిడిఓ అరుణ, తహశీల్దారు రోజారాణి, సర్పంచ్ నాగూరు, కార్యదర్శి కరుణ శ్రీ, టిడిపి నాయకులు పురుషోత్తం, సుబ్రమణ్యం, రాజశేఖర్‌యాదవ్, ప్రసన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పరిధిలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పనుల అభివృద్ధికి నిధులతో ముడిపెట్టకుండా ముందుకు పోవాలని శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మొంథా తుఫానుతో నష్టపోయిన వనరులకు సంబంధించి ఆయన సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ పట్టణంలో సంభవించిన నష్టాలకు సంబంధించి వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి దిశ దేశ నిర్దేశం చేస్తూ మున్సిపల్, దేవస్థానం నియోజకవర్గానికి రెండు కళ్ళు అని పట్టణాభివృద్ధి దేవస్థానం అభివృద్ధి ఒకదానితో ఒకటి ముడిపడి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కమిషనర్ అభివృద్ధికి సంబంధించి రూ.3కోట్లతో తయారు చేసిన అంచనాలను ఎంఎల్ఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధిస్తామని భరోసా ఇచ్చారు. నేడు ఏ వార్డులో చూసినా గతుకుల రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లను బాగు చేయాలని సూచించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి దేవస్థానం నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలన్నారు. దేవస్థానం, మున్సిపాల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెద్ద కాలువల నిర్మాణం, అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌కు సంబంధించి ఎంఎల్ఏ చర్చించినపుడు కమిషన్ భవాని ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వమే ఎపియుఎఫ్‌డిసి ద్వారా డిపిఆర్ చేసి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

## ఒకే చెట్టుకు రెండు రంగుల ఊడలు!

**భక్తి పారవశ్యంలో భక్తులు**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రవేశించే బిక్షాల గాలిగోపురం పక్కనే అన్నపూర్ణా సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయం ఉంది. ఆలయం ఎదురుగా రెండు మర్రిచెట్లు మధ్యలో వేపచెట్టు ఉంది. పురాతనమైన ఈ చెట్టును స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే వారు పూజించే వారు. ఇటీవల వర్షాలతో ఈ చెట్ల నుంచి ఊడలు దిగుతున్నాయి. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఒకే చెట్టు నుంచి రెండు రకాల ఉడలు దిగటంతో భక్తులు విశేషంగా భావించి పూజిస్తున్నారు. ఒక రకమైన ఊడలు ఎర్రగా ఉండగా ఇవి స్వామికి నిదర్శనం అని మరొ రకం ఊడలు పసుపు పచ్చగా ఉన్నాయని అవి అమ్మవారికి నిదర్శనం అని బుధవారం భక్తులు పూజించటం మొదలెట్టారు.

## మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు

**- శ్రీ కనకనాశమ్మ ఆలయంకు నూతన బస్ సర్వీసు**



కుప్పం, అక్టోబర్29 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో కుప్పంనుంచి పెద్దవంక పంచాయతీలోని శ్రీ కనకనాశమ్మ ఆలయం దాకా నూతన ఆర్టీసీ బస్ సర్వీసును వారు పూజ నిర్వహించి ప్రారంభించారు. కుప్పంలో 70కోట్లతో అత్యాధునిక బస్‌స్టేషన్ నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, ఎఎంసి చైర్మన్ జిఎం రాజు, రెస్కోచైర్మన్ ప్రతాప్ కుమార్, కడ సభ్యులు రాజ్‌కుమార్, సుగుణమ్మ, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాలుగు మండలాల నేతలు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో ఐజి

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని అనందవల్ల సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో కార్తీక మాసం భక్తుల తాకిడి పెరుగుతుంది. బుధవారం ఐజి రవి కృష్ణ పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు ఎఎస్పి రవిమనోహాచ్చారి ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి వారి సహచరులున్నారు.

## వైకాపా నేతకు సన్మానం



వాకాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: వైకాపా నేత, వాకాడు ఉప సర్పంచి పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డికి శాలువా కప్పి పూలమాలు వేసి కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకాడు యూత్ ఆధ్వర్యంలో తమ అభిమాని నాయకుడు, సేవకుడు రాజశేఖర్‌రెడ్డికి జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అభిమానులకు కేకులు పంచిపెట్టారు. ఈ జన్మదిన వేడుకల్లో ఎంపీటీసీ యాద గిరి, వైకాపా నాయకుడు వాకాటి రవి కుమార్, గూడూరు సుధాకర్ రెడ్డి, నాయకులు, యూత్ నాయకుడు గాయం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## గరుడవారధిపై మరో ప్రమాదం -ద్విచక్ర వాహనదారుడు మృతి



తిరుపతి, అక్టోబర్ 29ప్రభాతవార్త: గరుడవారధిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి పడటంతో ప్రాణాలు కోల్పోయాడు. తిరుపతి రూరల్ మంగళంకు చెందిన రమేశ్(40) పనిమీద తిరూచానూరు కెళ్ళితిరిగి మంగళంకు ద్విచక్ర వాహనంపై గరుడ వారధిపై వస్తుండగా లక్ష్మీపురం కూడలి వద్ద మలుపులో అదుపుతప్పాడు. వెంటనే మోటారు సైకిల్‌పై నుండి క్రిందపడ్డాడు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఈస్టు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహన్ని రుయాకు తరలించారు. కాగా గరుడవారధిపై లక్ష్మీపురం కూడలి ప్రమాదకరంగామారినా పట్టించుకోలేకపోవడం ప్రాణాలు తీస్తున్నారు.

## తిరుచానూరు యువతి ఆత్మహత్య!

తిరుపతి, అక్టోబర్ 29ప్రభాతవార్త: తిరుపతిలోని ఓ హోటల్‌లో తిరుచానూరు యువతి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రాత్రి ఈ సంఘటన వెలుగు చూసింది. ఈస్టు పోలీసుల వివరాల మేరకు... తిరుచానూరుకు చెందిన దాక్షాయిని (30) బుధవారం ఉదయం డిబిఆర్ ఆస్పత్రి మార్గంలోని ఓ హోటల్‌కు వచ్చింది. హోటల్ గదిలో ఆమె ఇంజన్‌ఆయిల్‌పోసుకుని నిప్పంటించుకుంది. ఆస్పత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. బంధువుల ఫిర్యాదు మేరకు ఈస్టు ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు.

Municipal Administration Department

**VENKATAGIRI MUNICIPALITY**

**'e'-procurement Notice**

**Roc. No.594/2025/E1** **Dated: 29-10-2025**

**Grant : GENERAL FUND - 3 Works**

**Estimate Contract Value Rs. 4.32 lakhs**

IFB. No. 11/VMC/MPLTY/2025-26 to 13/VMC/MPLTY/2025-26

Nature of works: Engaging of Hitachi at SS Tank and Laying of 100mm Dia AC Pipe Line at Kumaragunta.

**Bid Document download Start Time & Date**
**: 11.30 AM on 29-10-2025**

**Bid Document download End Time & Date**
**: 04.30 PM on 06-11-2025**

**Bid Submission Closing Time & Date**
**: 05.00 PM on 06-11-2025**

Further details can be seen @ 'e' procurement market place @ "www.eprocurement.gov.in" Mobile No. 8096868506.

**Sd/-Commissioner,Venkatagiri Municipality**